నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 30-11-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 95 | పేజీలు:4 | వెల: రూ.1/-

బిట్‌కాయిన్‌ను కరెన్సీగా గుర్తించడంలేదు: కేంద్ర ఆర్థికశాఖ

న్యూఢిల్లీ, నవంబర్ 29: క్రిప్టోకరెన్సీపై కేంద్రం ఓ ప్రకటన చేసింది. దేశంలో బిట్‌కాయిన్‌ను కరెన్సీగా గుర్తించేందుకు ఎటువంటి ప్రతిపాదన లేదని ఇవాళ కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తెలిపింది. లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చిన మంత్రి నిర్మలా సీతారామన్.. బిట్‌కాయిన్ లావాదేవీలకు చెందిన డేటాను ప్రభుత్వం సేకరించడంలేదన్నారు. అయితే ఈ శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో క్రిప్టో బిల్లును ప్రవేశపెట్టాలని కేంద్రం యోచిస్తున్నది. బిట్‌కాయిన్ లావాదేవీల నియంత్రణ కోసం రెగ్యులేటరీ వ్యవస్థ అవసరం అన్న అభిప్రాయాన్ని ఇటీవల కేంద్రం వ్యక్తం చేసింది. అయితే బ్యాంక్ నోటు అన్న నిర్వచనాన్ని మారుస్తూ, దాంట్లో డిజిటల్ కరెన్సీని కూడా జోడించే విధంగా ఆర్బీఐ చట్టాన్ని సవరించాలని ఇటీవల కేంద్రాన్ని ఆర్బీఐ కోరిన విషయం తెలిసిందే.

ఒమిక్రాన్'పై కేబినెట్‌లో చర్చ..

హైదరాబాద్, నవంబర్ 29:: సీఎం కేసీఆర్ అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ప్రగతిభవన్‌లో కొనసాగుతున్నది. సమావేశం ప్రారంభమైన అనంతరం రాష్ట్ర ప్రజారోగ్యం, వైద్యసేవలకు సంబంధించిన హెల్త్ డిపార్ట్‌మెంట్ సన్నద్ధత, అనుసరిస్తున్న కార్యాచరణ, రాష్ట్రవ్యాప్తంగా కోవిడ్ టీకాల పురోగతి, మందుల లభ్యత, ఆక్సిజన్ బెడ్స్ సామర్థ్యం, తదితర అంశాలపై కేబినెట్ సమీక్షించింది.

నివేదికను అందించిన వైద్యారోగ్యశాఖ

ఇందుకు సంబంధించిన కార్యాచరణపై వైద్యశాఖ అధికారులు నివేదిక అందించారు. మరిన్ని ఎక్కువగా కరోనా పరీక్షలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్ల సన్నద్ధతపై కేబినెట్‌లో చర్చించారు. ఈ సందర్భంలో కరోనా కొత్త వేరియంట్ 'ఒమిక్రాన్' వ్యాప్తి నేపథ్యంలో దానిపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కేబినెట్‌కు వివరించారు. వివిధ దేశాల్లో ఒమిక్రాన్ పరిస్థితిని తెలిపి, నివేదిక సమర్పించారు. గత రెండేళ్లుగా కరోనా కట్టడికి జరిగిన పురోగతిపై మంత్రివర్గం చర్చించింది. వైద్యశాఖ పూర్తి సన్నద్ధతతో ఉన్నదని, అన్ని రకాల మందులు, పరికరాలు, మానవ వనరులు, పూర్తిగా అందుబాటులో ఉన్నాయని, తామంతా సంసిద్ధంగా ఉన్నామని వైద్యారోగ్యశాఖ అధికారులు కేబినెట్‌కు వివరించారు.

మౌలిక వసతులు సమకూర్చుకోవాలని ఆదేశం

రాష్ట్రంలోని అన్ని దవాఖానాల్లోని పరిస్థితులను సమీక్షించి, అన్ని రకాల మందులు, టీకాలతో సహా ఇతరత్రా అవసరమైన మౌలిక వసతులను సమకూర్చుకొని.. ఎలాంటి పరిస్థితి ఉత్పన్నమైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వ్యాక్సినేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని, అందుకు మంత్రులందరూ వారి వారి జిల్లాల్లో సమీక్షించాలని, అవసరమైన వారందరికీ సత్వరమే టీకా ఇప్పించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు.

జిల్లాల వారీగా టీకా ప్రక్రియను సమీక్షించి, అదిలాబాద్, కుమ్రంభీం, నిర్మల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల్ జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆరోగ్యశాఖ కార్యదర్శిని కేబినెట్ ఆదేశించింది.

కేంద్రం తీరుతో తెలంగాణ రైతాంగానికి నష్టం : నామా నాగేశ్వర్‌రావు

న్యూఢిల్లీ, నవంబర్ 29:కేంద్రం తీరుతో తెలంగాణ రైతాంగానికి నష్టం వాటిల్లుతున్నదని టీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం ఆయన ఢిల్లీలో మాట్లాడుతూ రెండు నెలలుగా కేంద్రంతో చర్చలు జరుపుతుంటే.. కేంద్రం చేతులెత్తివేసిందని విమర్శించారు. దేశ రైతాంగం రోడ్లపై ఉంటే.. ఇప్పుడు తెలంగాణ రైతాంగం రోడ్డున పడేలా చేస్తున్నారన్నారు. పార్లమెంట్‌లో పంట కొనుగోళ్లపై వాయిదా తీర్మానాలు ఇస్తే, స్పీకర్ తిరస్కరించారన్నారు.

పంటల కొనుగోళ్లపై చర్చకు నిరాకరించడంతో ఆందోళన చేశామని, వ్యవసాయ చట్టాల రద్దు బిల్లు కూడా ఏకపక్షంగా చర్చ లేకుండా ఆమోదించారన్నారు. వ్యవసాయ చట్టాల రద్దు బిల్లుపై చర్చ లేకుండా చేశారన్నారు. సీఎం కేసీఆర్ మూడు రోజులు ఇక్కడే ఉంది కేంద్రాన్ని ఒప్పించే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు.

తెలంగాణను, రైతులను, తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రం అవమానిస్తుందని ఆరోపించారు. ఏడేళ్ల కాలంలో అనేక కార్యక్రమాలు చేపట్టి రైతాంగాన్ని బలోపేతం చేశామని తెలిపారు. పంటల సాగు, ఉత్పత్తి పెంచేందుకు అనేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. మళ్లీ పార్లమెంట్ ఉభయ సభల్లో తెలంగాణ రైతాంగ సమస్యలను లేవనెత్తుతామన్నారు.

కనీస మద్దతు ధరకు చట్ట బద్ధత తీసుకురావాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగానికి సంబంధించిన అంశం కాబట్టి మిగతా పార్టీల ఎంపీలు కుడా తమతో కలిసి రావాలని కోరారు. తెలంగాణ ఎంపీలంతా ఉభయసభల్లో కలిసి పోరాడాలన్నారు. లేదంటే రైతుల ఆగ్రహానికి గురవుతారని, రానున్న కాలంలో మిమ్మల్ని నమ్మే పరిస్థితి ఉండదంటూ హితవు పలికారు.

విద్యార్థులు, తల్లిదండ్రులు భయపడాల్సిన అవసరం లేదు : మంత్రి సబిత

హైదరాబాద్, నవంబర్ 29: కరోనా విషయంలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని.. విద్యార్థులు, తల్లిదండ్రులు భయపడాల్సిన అవసరం లేదని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. పాఠశాలల్లో కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో మంత్రి సోమవారం కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో సమావేశమయ్యారు. విద్యా సంస్థల్లో ఎవరికి వారు కొవిడ్ నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

విద్యార్థులు తప్పనిసరిగా మాస్క్‌లు ధరించడం, భౌతిక దూరం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులు మరింత అప్రమత్త ంగా ఉండేలా, చేతులు శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

విద్యార్థులందరికీ పరీక్షలు

రాష్ట్రంలో పలు విద్యా సంస్థల్లో కరోనా కేసులు వెలుగుచూస్తున్నా.. వెంటనే ఆయా విద్యా సంస్థల్లోని విద్యార్థులందరికీ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. విద్యా సంస్థల్లో పని చేస్తున్న ప్రతీ ఒక్కరూ రెండు డోసులు వేసుకునేలా ఆయా యాజమాన్యాలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం కరోనా తగ్గిందని భావించి.. నిబంధనలను పాటించడంలో యాజమాన్యాలు, విద్యార్థులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న సమాచారం ఉందన్నారు. అలాంటి పరిస్థితులు పునారావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

నిబంధనలు పాటించేలా చూడాలి

కరోనా నిబంధనలను పాటించే విధంగా అవసరమైన సానిటైజర్లు, థర్మల్ స్క్రీనింగ్ మిషన్లను విద్యా సంస్థలు తప్పనిసరిగా వినియోగించేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కరోనా కేసులు నిలకడగా ఉన్నా, మూడో దశ ముప్పు ఉందన్న నేపథ్యంలో అన్ని స్థాయిల విద్యాసంస్థల్లో అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టేందుకు తగిన ఆదేశాలను జారీ చేయాలని మంత్రి సూచించారు.

పార్లమెంట్‌లో గాంధీ విగ్రహం వద్ద టీఆర్ఎస్ ఎంపీల నిరసన

న్యూఢిల్లీ, నవంబర్ 29: పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద టీఆర్ఎస్ ఎంపీలు ఆందోళనకు దిగారు. రైతులను శిక్షించ వద్దు.. ఎదుగుతున్న రాష్ట్రాలకు అన్యాయం చేయొద్దు. వెంటనే జాతీయ రైతు ఉత్పత్తుల విధానాన్ని ప్రకటించాలి అనే ప్లకార్డులను టీఆర్ఎస్ ఎంపీలు ప్రదర్శించారు.

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో సోమవారం టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె కేశవరావు, లోక్‌సభలో టీఆర్ఎస్ పార్టీ నేత నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు సురేష్ రెడ్డి, బండా ప్రకాశ్, జోగినపల్లి సంతోష్ కుమార్, లోక్‌సభ సభ్యులు డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి, బీబీ పాటిల్, మన్నె శ్రీనివాస్ రెడ్డి, పోతుగంటి రాములు, వెంకటేష్ నేత తదితరులు ప్లకార్డులు పట్టుకొని తమ నిరసన వ్యక్తం చేశారు.

తెలంగాణ వంటి రాష్ట్రాల్లో సీఎం కేసీఆర్ ముందు చూపు వల్ల రైతులకు సమృద్ధిగా సాగునీరు, ఎరువులు, విత్తనాలు, రైతు బంధు వంటి పథకాలతోపాటు 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంటు అందటం వల్ల దిగుబడులు పెరిగాయని, ఆ మేరకు ఎఫ్‌సీఐ కొనుగోళ్లను పెంచాల్సి ఉందన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవడమే కాదు, రైతు సంక్షేమం కోసం అవసరమైన విధానాలను చేపట్టాలన్నారు. దేశానికి ఆదర్శవంతమైన రైతుకు ప్రయోజనం చేకూర్చే అనేక పథకాలు అమలు అవుతున్నాయని, అలాగే దేశ వ్యాప్తంగా ఉన్న రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం విధి, విధానాలను రూపొందించి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అప్పటి వరకు రైతుల కోసం తమ ఆందోళన, ఉద్యమం కొనసాగుతుందని వారు తెలిపారు.

తెలంగాణ చరిత్రను మార్చిన కేసీఆర్ దీక్ష : ఎమ్మెల్యే నన్నపనేని

వరంగల్, నవంబర్ 29:: ప్రత్యేక తెలంగాణ కోసం 2009 నవంబర్ 29 న కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ చరిత్రనే మార్చివేసిందని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపనేని రవీందర్ అన్నారు.

ఆ దీక్షకు నేటికి 12 ఏండ్లు అవుతున్న సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమంలో భాగంగా వరంగల్‌లోని చింతల్ బ్రిడ్జి తెలంగాణ తల్లి జంక్షన్ వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నన్నపునేని మాట్లాడుతూ.. తన ప్రాణాలను ఫణంగా పెట్టి కేసీఆర్ తెలంగాణా కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారన్నారు. తెలంగాణా వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అంటూ ఉద్యమంలో తన ప్రాణాలను లెక్కచేయకుండా ముందుకు కదిలి తెలంగాణా సాధించారని ప్రశంసించారు. ఎందరో వీరుల పోరాటం, అమరుల త్యాగఫలంతో తెలంగాణను సాధించుకున్నామని పేర్కొన్నారు.

తెలంగాణా ఏర్పాటు తర్వాత రాష్ట్రం అద్భుతంగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. దీక్షా దివస్ సందర్భంగా నాటి పోరాటాన్ని గుర్తు చేసుకుంటున్నామని, కేసీఆర్‌ఉద్యమ చరిత్ర 15 తరాలకు తెలిసేలా ఏర్పాట్లు చేసి గడప గడపకు వెళ్లి ప్రచారం చేస్తామని ఎమ్మెల్యే న అన్నారు.

కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కొవాగ్జిన్ ఎగుమతులు ప్రారంభించిన భారత్ బయోటెక్

హైదరాబాద్, నవంబర్ 29: హైదరాబాద్‌కు చెందిన భారత్ బయోటెక్ సంస్థ తాను తయారు చేసిన కొవాగ్జిన్ ఎగుమతులు ప్రారంభించింది. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎగుమతుల ఆర్డర్‌లను నవంబర్‌లో క్లియర్ చేస్తామని సంస్థ ప్రకటించింది. ఆ తర్వాత నెలల్లో కూడా ఎగుమతులు కొనసాగుతాయని తెలిపింది. కొవాగ్జిన్ అత్యవసర వినియోగానికి ఆమోదం పొందిన దేశాల జాబితా పెరుగుతున్నదని, డిసెంబర్ నెలలో ఇతర దేశాలకు కూడా ఎగుమతులు మొదలవుతాయని భారత్ బయోటెక్ తెలిపింది.

కొవాగ్జిన్ ఎగుమతులకు అనుమతులు ఇచ్చిన భారత ప్రభుత్వానికి భారత్ బయోటెక్ కృతజ్ఞతలు చెప్పింది. కరోనా మహమ్మారిపై అంతర్జాతీయంగా జరుగుతున్న పోరాటంలో ప్రస్తుతం కొవాగ్జిన్ కీలకంగా మారిందని ఫార్మా సంస్థ పేర్కొన్నది. కాగా, దేశంలో ఇప్పటివరకు 122.41 కోట్ల మందికి వ్యాక్సినేషన్ పూర్తయిందని భారత ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది.

స్వయం ఉపాధి పొందుతున్న యువతకు ప్రోత్సాహం : మంత్రి తలసాని

హైదరాబాద్, నవంబర్ 29:స్వయం ఉపాధి పొందుతున్న యువతను ప్రోత్సహించేలా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.

సోమవారం మంత్రి శ్రీనివాస్ యాదవ్ మాసాబ్ ట్యాంక్‌లోని తన కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శర్మన్‌తో కలిసి వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 17 మంది దివ్యాంగ లబ్ధిదారులకు 20 లక్షల రూపాయల విలువైన సబ్సిడీ చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..కిరాణం, జిరాక్స్, సెల్ ఫోన్, టెంట్ హౌస్, ఫొటో స్టూడియో తదితర రంగాలలో స్వయం ఉపాధి పొందుతున్న వారిని ప్రోత్సహించేలా.. 60 నుంచి 70 శాతం సబ్సిడీపై ప్రభుత్వం ప్రభుత్వం రుణాలను అందిస్తున్నట్లు వివరించారు.

ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ సంఘం ఏడీ రాజేందర్, నోడల్ ఆఫీసర్ కృష్ణ, ఎఫ్ఆర్‌వో పవన్ తదితరులు పాల్గొనారు.

12 మంది ప్రతిపక్ష సభ్యులు రాజ్యసభ నుంచి సస్పెండ్

న్యూఢిల్లీ, నవంబర్ 29: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో హింసాత్మకంగా ప్రవర్తించిన 12 మంది ప్రతిపక్ష ఎంపీలను శీతాకాల సమావేశాలు ముగిసే వరకు రాజ్యసభ నుంచి సస్పెండ్ చేశారు. ఎలమరం కరీం (సీపీఎం), ఫూలో దేవి నేతమ్ (కాంగ్రెస్), ఛాయా వర్మ (కాంగ్రెస్), రిపున్ బోరా (కాంగ్రెస్), బినోయ్ విశ్వం (సీపీఐ), రాజమణి పటేల్ (కాంగ్రెస్), డోలా సేన్ (టీఎంసీ), శాంత ఛెత్రి (టీఎంసీ), సయ్యద్ నాసిర్ హుస్సేన్ (కాంగ్రెస్), ప్రియాంక చతుర్వేది (శివసేన), అనిల్ దేశాయ్ (శివసేన), అఖిలేష్ ప్రసాద్ సింగ్ (కాంగ్రెస్) సస్పెన్షన్‌కు గురయ్యారు.

'రాజ్యసభ 254వ సెషన్ చివరి రోజు, అంటే ఆగస్టు 11న భద్రతా సిబ్బందిపై ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడాన్ని సభ తీవ్రంగా ఖండిస్తుంది. సభ సభాపతి అధికారాన్ని పూర్తిగా విస్మరించడం, సభా నియమాలను పూర్తిగా దుర్వినియోగం చేయడం, దుష్ప్రవర్తన, ధిక్కార, వికృత, హింసాత్మక ప్రవర్తన, ఉద్దేశపూర్వక దాడుల ద్వారా సభ మర్యాదను దిగజార్చడం వంటి వాటికి పాల్పడ్డారు' అని ప్రకటనలో పేర్కొన్నారు.

నిలకడగా ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ ఆరోగ్యం..

అమరావతి, నవంబర్ 29:ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఆరోగ్యం నిలకడగా ఉందని దవాఖాన వైద్యులు సోమవారం ప్రకటించారు. పోస్టు కొవిడ్ సమస్యలతో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని ఏఐజీ దవాఖానలో చేరారు. ఈ సందర్భంగా చికిత్స అందిస్తున్న వైద్యులు గవర్నర్ తాజా ఆరోగ్య పరిస్థితిని తెలియజేస్తూ ప్రకటనను జారీ చేశారు.

ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వారు వెల్లడిం చారు. ఈ నెల 18 న కొవిడ్ బారిన పడగా ఏఐజీ దవాఖానలో చికిత్స తీసుకొని.. సంపూర్ణ ఆరోగ్యంతో 28న విజయవాడలోని తన నివాసానికి చేరుకున్నారు. ఈ క్రమంలో తిరిగి నిన్న (ఆదివారం) గవర్నర్ మరోసారి అస్వస్థతకు గురికావడంతో ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు వచ్చి దవాఖానలో చేరారు.

చర్చ లేకుండానే.. సాగు చట్టాల రద్దు బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, నవంబర్ 29:మూడు నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేసేందుకు ఇవాళ లోక్‌సభలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి బిల్లును ప్రవేశపెట్టారు. అయితే ఆ సమయంలో విపక్ష సభ్యులు ఆందోళన చేపట్టారు. బిల్లుపై చర్చ నిర్వహించకుండానే సాగు చట్టాలను రద్దు చేసినట్లు విపక్షాలు ఆరోపించాయి. దీంతో సభలో రభస మొదలైంది. ఈ బిల్లుపై చర్చ చేపట్టాలని కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరీ డిమాండ్ చేశారు. ఇక తెలంగాణ రాష్ట్ర సమితి ఎంపీలు వెల్‌లోకి దూసుకువెళ్లిన నిరసన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. ధాన్యం కొనుగోలుపై చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలుపై స్పష్టత ఇవ్వాలని నినాదాలు చేశారు.

చర్చ లేకుండా మూడు వ్యవసాయ చట్టాల రద్దు చేయడంతో విపక్షాలు గందరగోళం సృష్టించాయి. మూజువాణి ఓటుతోనే బిల్లుకు ఓకే చెప్పేశారు. దీంతో విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకువచ్చారు. అయితే చర్చను చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పిన స్పీకర్ బిర్లా.. ఆ గందరగోళం మధ్య సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు.

కరోనా టీకాలో వెనుకున్న కాంగ్రెస్, మిత్రపక్షాల పాలిత రాష్ట్రాలు

న్యూఢిల్లీ, నవంబర్ 29: కరోనా వ్యాక్సినేషన్‌లో కాంగ్రెస్, దాని మిత్రపక్షాల పాలిత రాష్ట్రాలు వెనుక ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ లేదా దాని మిత్రపక్షాల పాలిత రాష్ట్రాలు 90 శాతం మందికి పైగా ప్రజలకు మొదటి డోస్, 50 శాతం కంటే ఎక్కువ మందికి 2వ డోస్ ఇవ్వలేకపోయాయని పేర్కొన్నాయి.

మరోవైపు ఏడు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో 90 శాతం మందికిపైగా తొలి డోసు, 8 బీజేపీ పాలిత రాష్ట్రాల్లో 50 శాతం మంది ప్రజలు రెండవ డోస్ పొందినట్లు గణాంకాల ద్వారా ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

చరిత్రలో నేటినిజం



కం॥ మోకూపాలిలువట గుఱియు
మారినవాటా వరణపు మూర్పులతోడన
భారత ప్రధాన మంత్రిగ
నారాధన నంబు సడత పైకే గుప్రత్!!

(నవంబర్ 30 ఐ.కే గుప్రాల్ పుణ్యతిథి...)

-రాధశ్రీ

సెల్: 9494481210



ఆహ్వానం

44 కిన్నరి

కిన్నెర ఆర్ట్ థియేటర్స్
శ్రీ త్యాగరాయగానసభ

శాతవాహన విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి
ప్రముఖ కవి
ఆచార్య కడారు వీరారెడ్డి రచించిన
మనసు తొడుక్కున్న మనిషి
(దీర్ఘకావ్యం) గ్రంథావిష్కరణ



తేది: 02-12-2021 గురువారం
సాయంత్రం 6 గంటలకు
కళా సుబ్బారావు కళావేదిక,
శ్రీ త్యాగరాయగానసభ, చిక్కడపల్లి

ముఖ్యఅతిథి ఆవిష్కర్త : డా॥ కె.వి. రమణ, ఐ.ఎ.ఎస్. (ర)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు

సభాధ్యక్షులు : ఆచార్య తంగెడ కిషన్ రావు, ప్రముఖ కవి
ఉపకులపతి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

గౌరవ అతిథులు : శ్రీ కళాజనార్దనమూర్తి
అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగానసభ

ఆచార్య మనన చెన్నప్ప
తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం

శ్రీ దాస్యం సేనాధిపతి
ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు

శ్రీ బైస దేవదాసు
నేటి నిజం దినపత్రిక సంపాదకులు

డా॥ ఆర్. ప్రభాకరరావు, I.P.S. (Retd.) అధ్యక్షులు, కిన్నెర | మద్దాలి రఘురామ్ కార్యదర్శి, కిన్నెర | కళాకారద కార్యదర్శి, త్యాగరాయగానసభ

బి.1.1.529 వేరియంట్ ప్రమాదపు అంచున ప్రపంచం

సౌథ్ ఆఫ్రికాలో 09 నవంబర్ రోజున సేకరించిన స్పెసిమెన్‌లో బి.1.1.529 లేదా ఒమిక్రాన్ వేరింట్ తొలి కేసు బయట పడింది. డెల్టా వేరియంట్ కన్న ప్రమాదకరమైందిగా భావిస్తున్న బి.1.1.529 వైరస్‌ను 'వేరింట్ ఆఫ్ కన్సర్న్'గా 'ఒమిక్రాన్' పేరుతో 24 నవంబర్‌న ప్రపంచ ఆరోగ్య సంస్థ, డబ్ల్యూహెచ్ఓ ప్రకటించడంతో ప్రపంచ దేశాలు 3వ వేవ్ మేఘాలు కమ్మవచ్చనే భయంతో గడగడలాడడం ప్రారంభమైంది. దాదాపు 32 ప్రమాదకర మ్యుటేషన్లను కలిగి ఉన్న ఒమిక్రాన్ వేరియంట్ ప్రస్తుతం దక్షిణ ఆఫ్రికా అన్ని ప్రాంతాల్లో గుర్తించబడింది. ఒమిక్రాన్ వేరియంట్ వ్యాప్తిని కఠిన పర్యవేక్షణ, పూర్తి శాస్త్రీయ అవగాహనతో కట్టడి చేయాలని ప్రపంచ దేశాలను డబ్ల్యూహెచ్ఓ సూచిస్తున్నది. బి.1.1.529 వేరింట్ పూర్తి జీవోమ్ సీక్వెన్సింగ్‌ను సత్వరమే అర్థం చేసుకుంటూ, వేరియంట్ వ్యాధి తీవ్రతను అవగాహన చేసుకోవడం, నిర్ధారణ పరీక్షలను ప్రమాణీకరించడం, ఇమ్యూన్ రెస్పాన్స్ అధ్యయనం, సామాజిక కట్టడులను తెలుసు కోవడానికి కృషి చేయాల్సి ఉంది. వేరియంట్ వ్యాప్తిని నిరోధించడానికి సామాజిక క్రమశిక్షణలు, మాస్కుల ధారణ, చేతుల శుభ్రత, సానిటైజర్ల వాడకం, భౌతిక దూరాలను పాటించడం, సమూహాల కలయికలను నిరోధించడం, గృహాల్లో వెంటిలేషన్ ఉండేలా చూసుకోవడం, 2 డోసుల టీకాలను తీసుకోవడం లాంటి నియమాలను విధిగా పాటించాలి. కర్నాటకలోని దర్వాడ్ మెడికల్ కాలేజ్ (281 కేసులు), ఇంటర్నేషనల్ స్కూల్లో (46 కేసులు), హైదరాబాద్‌లోని మహింద్ర యూనివర్సిటీల్లో (30 కేసులు) ఇప్పటికే పలు విద్యార్థులకు/అధ్యాపకులకు కరోనా నిర్ధారణ కావడంతో మళ్ళీ కరోనా వైరస్ జన్యువులో వచ్చే మార్పులతో వ్యాప్తి రేటు, జ్వర తీవ్రత, వ్యాధినిరోధకతను ఎదుర్కోవడం, నిర్ధారణ పరీక్షల/చికిత్సల సవాళ్ళు లాంటి సమస్యలు ఉత్పన్నం కావడంతో మరో వేవ్ ప్రబలే అవకాశాలు పెరగవచ్చు. బెంగళూరు విమానాశ్రయంలో దిగిన 94 మంది దక్షిణాఫ్రికన్లలో ఇద్దరికి శనివారం కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కావడం కొంత భయాన్ని కలిగిస్తున్నది. ఒమిక్రాన్ వేరియంట్ దక్షిణాఫ్రికాలో బయట పడడంతో ఆ దేశం నుంచి వచ్చే యాత్రికుల పట్ల అతి జాగ్రత్తగా ఉండాలని దేశాలు నిర్ణయం తీసుకుంటున్నాయి. అంతర్జాతీయ విమానయానాన్ని వెంటనే రద్దు చేయాలని లేదా నియత్రించాలనే నిర్ణయం తీసుకోవాలని కూడా నిపుణులు సూచిస్తున్నారు. యూకె, బెల్జియమ్, జర్మనీ, చేక్ రిపబ్లిక్, బోత్స్‌వానా, హాంకాంగ్, ఇజ్రాయిల్ లాంటి దేశాల్లో ఒమిక్రాన్ వేరియంట్ తొలి కేసులు బయట పడ్డాయని వింటున్నాం. దక్షిణాఫ్రికాలో కొత్త వేరియంట్ వెలుగు చూడడంతో విదేశాల 'ఆంక్షల శిక్ష'ను అనుభవించినట్లు అవుతున్నదని భావిస్తున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా లాంటి దేశాల ప్రభుత్వాలు పలు ఆఫ్రికన్ దేశాల విమానయానాలను సోమవారం నుంచి కొద్ది రోజుల పాటు రద్దు కూడా చేశారు. ఇండియా, జపాన్, కెనడా లాంటి దేశాలు దక్షిణాఫ్రికా ప్రయాణీకులకు పరీక్షలు చేయడం, క్వారంటైన్ విధించడం జరుగుతోంది. దక్షిణాఫ్రికాలో ఇప్పటి వరకు 24 శాతం ప్రజలు మాత్రమే 2 డోలుల టీకాలు తీసుకోవడం కూడా ప్రమాదానికి మరింత కారణం అవుతున్నది. ఇప్పటికే దక్షిణాఫ్రికాలో 2.95 మిలియన్ల కేసులు, 89,783 కోవిడ్-19 మరణాలతో ఆఫ్రికాలోనే అత్యంత కరోనా బాదిత దేశంగా నిస్సహాయ స్థితిలో ఉన్నది. కొత్తగా గుర్తించిన ఒమిక్రాన్ వేరియంట్‌కు దాదాపు 32 మ్యుటేషన్లు ఉండడంతో టీకా పనితనం 40 శాతం తగ్గవచ్చని తెలుస్తున్నది.

కొత్త వేరింట్ నామకరణ విధానం:

కరోనా దక్షిణాఫ్రికాలో బయట పడిన కొత్త బి.1.1.529 వేరియంట్ శాస్త్రీయ నామకరణ విధానం ప్రకారం 'న్యూ' లేదా 'గ్జీ' అనబడే గ్రీక్ అక్షరాల పేరును నిర్ణయించడానికి బదులు 'ఒమిక్రాన్' అనబడే పేరును డబ్ల్యూహెచ్ఓ నిర్ణయించింది. 'న్యూ' పేరు 'న్యూ లేద నూతన' అనబడే ఆంగ్ల పదానికి దగ్గరగా ఉందని, 'గ్జీ' పేరు చైనా అధ్యక్షుడి పేరును తలపిస్తున్నదనే కారణంగా, వాటికి బదులు 'ఒమిక్రాన్' అనే పేరును నిర్ణయించారని తెలుస్తున్నది. సాధారణ నియమం ప్రకారం 'డెల్టా వేరియంట్' తరువాత 'న్యూ వేరియంట్' పేరు రావాలి. అలాగే 'న్యూ వేరియంట్' తరువాత 'గ్జీ వేరియంట్' పేరును నిర్ణయించాలి.

భారత్‌లో కేంద్రప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, వైద్య శాఖ, స్థానిక ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో కట్టడి చర్యలు తీసుకోవడం ప్రారంభించాలి. రెండు డోసుల టీకాలుతీసుకోని వారు వెంటనే జాగిరత్త పడాలి. అంతర్జాతీయ ప్రయాణీకుల కదలికల్ని నిరోధించడం లేదా క్వారంటైన్ విధించడం లాంటి చర్యలతో కట్టుదిట్టం చేయాలి. కొత్త వేరియంట్ బయట పడిన నేపథ్యంలో పరిస్థితులను సమీక్షించిన ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ అన్ని దశల్లో తగు చర్యలను తీసుకోవాలని కోరారు. పలు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమ విమానాశ్రయాలు, విదేశీ ప్రయాణీకులను పర్యవేక్షించడం ప్రారంభించారు. ఇప్పుడిప్పుడే 2వ అల మేఘాలు తొలిగి, 3వ అల రాకపోవచ్చనే ప్రకటనలతో ఉపశమనం పొందిన ప్రజలు, ఒమిక్రాన్ వేరియంట్ వార్తలతో 3వ అల రావచ్చని గజగజవణుకుతున్నారు. ఇప్పటికే ఢిల్లీ, కేరళ, యంపీ లాంటి పలు రాష్ట్రాలు జాగ్రత్తలు తీసుకోవడం ప్రారంభించడం ముదావహం. మరో ఒమిక్రాన్ వేరియంట్ ప్రవేశంతో ప్రపంచ దేశాల ప్రజారోగ్యం మళ్ళీ ప్రమాదంలో పడుతుందని, అధిక మరణాలు నమోదు కావచ్చన్న హెచ్చరికలతో ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతగా కరోనా వ్యాప్తి కట్టడికి సామాజిక క్రమశిక్షణలు పాటించాలని కోరుకుందాం. రేపటి ఆరోగ్య భారత నిర్మాణంలో భాగస్వామ్యం తీసుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

#AIRNxt ప్రారంభించిన ఆల్ ఇండియా రేడియో

న్యూఢిల్లీ, నవంబర్ 29 రానున్న 52 వారాల పాటు, భారతదేశం అంతటా అన్ని రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాలలలోని ఏఐఆర్ స్టేషన్‌లు, స్థానిక కళాశాలలు, విశ్వవిద్యాలయాల యువకులకు ఏఐఆర్ కార్యక్రమాలలో పాల్గొనడానికి తగిన అవకాశం కల్పిస్తాయి, యువ కేంద్రీకృత ప్రదర్శనలపై చర్చించడానికి, వాటిని తగిన విధఃగా నిర్వహించడానికి కూడా యువతను అనుమతిస్తారు. ఈ ప్రదర్శనలు గడిచిన 75 సంవత్సరాల స్వాతంత్ర్యంలో దేశం సాధించిన విజయాల గురించి మాట్లాడటానికి యువతను ప్రోత్సహిస్తాయి. దేశం వివిధ రంగాలలో ఎలాంటి ఉన్నత స్థానాలకు చేరాలని వారు ఆశిస్తున్నారు కూడా చర్చించేందుకు వీలు కల్పిస్తారు. ఈ విధంగా యువత వారి పెద్ద కలలను ప్రసారం చేయవచ్చు. భారతదేశ భవిష్యత్తును నిర్వచించవచ్చు. భారతదేశంలోని ప్రతి ప్రాంతాలలో గల 1000 విద్యా సంస్థల నుండి దాదాపుగా 20వేల మంది యువత 167 ఏఐఆర్ స్టేషన్ల ద్వారా ఏడాది కాలం పాటు వివిధ కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఏఐఆర్ కేంద్రాలు

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా మునుపెన్నడూ విన్నని స్వరాలను వెలుగులోకి తేనున్నాయి. కొత్త ప్రోగ్రామ్ చంఎఖీఖీలీబి ద్వారా ఆల్ ఇండియా రేడియోలో మొదటిసారిగా ఈ స్వరాలు వెలుగులోకి రానున్నాయి. ఆల్ ఇండియా రేడియోలో దేశవ్యాప్తంగా వేలాది మంది యువత మరియు వందలాది విద్యాసంస్థలు పాల్గొననున్న ఇది అతిపెద్ద సింగిల్ థీమ్ షో ఇది కానుంది. ఈ టాలెంట్ హంట్ షో చంఎఖీఖీలీబి అన్ని ప్రధాన భారతీయ భాషలు మరియు మాండలికాలలోనూ ప్రసారం చేయబడుతుంది.

ఇజ్ రాయెల్ ప్రజల కు మరియు ఇజ్ రాయెల్ ప్రధాని శ్రీ నఫ్తాలీబెనెత్ కు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 29:హానుకాహ్ సందర్భం లో ఇజ్ రాయెల్ ప్రజల కు, ఇజ్ రాయెల్ ప్రధాని శ్రీ నఫ్తాలీ బెనెత్ కు, ప్రపంచవ్యాప్తం గా నివసిస్తున్నటువంటి యూదుల కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ శుభాకాంక్షల ను వ్యక్తం చేశారు.

ప్రధాన మంత్రి ఒక ట్వీట్ లో –

"ఎనిమిది రోజుల పాటు జరుపుకొనే దీపాల పండుగ అయినటువంటి 'హానుకాహ్ సమ్ యియాహ్' సందర్భం లో ఇజ్ రాయెల్ ప్రధాని శ్రీ ఏనిజీటబిజీశ్రీతిఎవనినివబిబి కు, స్నేహశీలురైన ఇజ్ రాయెల్ ప్రజల కు, ఇంకా ప్రపంచం అంతటా ఉన్న యూదు జనుల కు ఇవే శుభాకాంక్షలు." అని పేర్కొన్నారు.

ఎన్ సిసి దినం నాడుఎన్ సిసి కేడెట్స్ కు అభినందనలు తెలిపిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 29:ఎన్ సిసి దినం సందర్భం లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఎన్ సిసి కేడెట్స్ కు అభినందనలు తెలిపారు. భారతదేశం అంతటా ఉన్నటువంటి ఎన్ సిసి పూర్వ విద్యార్థులు ఎన్ సిసి పూర్వ విద్యార్థుల సంఘం యొక్క కార్యకలాపాల లో పాలుపంచుకొంటూ ఉండాలని, అంతేకాకుండా, వారి సమర్థన ద్వారా ఆ సంఘాన్ని వర్ధిల్లేటట్లు చేయాలని శ్రీ నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు.

"ఎన్ సిసి దినం సందర్భం లో ఇవే అభినందనలు. 'ఐకమత్యం మరియు క్రమశిక్షణ'.. ఈ ధ్యేయం ద్వారా ప్రేరణ ను పొందిన ఎన్ సిసి భారతదేశ యువతీ యువకుల కు వారి సిసలైన సామర్థ్యాన్ని తెలుసుకోవడం కోసం, అలాగే దేశ నిర్మాణాని కి తోడ్పడం కోసం ఒక మహత్తరమైన అనుభవాన్ని ప్రసాదిస్తుంది. ఈ సంవత్సరం జనవరి లో జరిగిన ఎన్ సిసి ర్యాలీ లో నేను ఇచ్చిన ఉపన్యాసం ఇదుగో...

రోడ్డు ప్రమాదం ఘటన లో బాధితులైన వారికి పిఎమ్ఎన్ఆర్ఎఫ్ నుంచి పరిహారాన్ని ప్రకటించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 29:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ పశ్చిమ బంగాల్ లోని నాదియా లో ఒక రోడ్డు ప్రమాదం ఘటన జరిగినందువల్ల ప్రాణాల ను కోల్పోయిన వ్యక్తుల దగ్గరి సంబంధికుల కు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పిఎమ్ఎన్ఆర్ఎఫ్) నుంచి ప్రతి ఒక్కొక్కరికి 2 లక్షల రూపాయల వంతున పరిహారాన్ని ప్రకటించారు. ఈ దుర్ఘటన లో గాయపడిన వారికి 50,000 రూపాయల వంతున ఇవ్వడం జరుగుతుంది.

ప్రధాన మంత్రి కార్యాలయం (పిఎంఒ) ఒక ట్వీట్ లో –

"పశ్చిమ బంగాల్ లోని నాదియా లో ఒక రోడ్డు ప్రమాదం ఘటన జరిగినందువల్ల ప్రాణాల ను కోల్పోయిన వ్యక్తుల దగ్గరి సంబంధికుల కు ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి (పిఎమ్ఎన్ఆర్ఎఫ్) నుంచి ప్రతి ఒక్కొక్కరికి 2 లక్షల రూపాయల వంతున పరిహారాన్ని ప్రకటించారు. ఈ దుర్ఘటన లో గాయపడిన వారికి 50,000 రూపాయల వంతున ఇవ్వడం జరుగుతుంది" అని పేర్కొంది.

ఢిల్లీ హట్ లో జరుగుతున్న ఆది మహోత్సవ్ లో ట్రైఫెడ్తో కలిసి దౌత్యవేత్తల దినోత్సవాన్ని నిర్వహించిన భారత విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ, నవంబర్ 29:ఢిల్లీ హట్ లో జరుగుతున్న ఆది మహోత్సవ్ లో ట్రైఫెడ్తో కలసి భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ శనివారం(2021 నవంబర్ 27) దౌత్యవేత్తల దినోత్సవాన్ని నిర్వహించింది. భారత గిరిజన సంస్కృతి, వారసత్వాన్ని విదేశీయులకు పరిచయం చేసి, స్థానికులకు సాధికారత కల్పించి, స్వావలంబన భారతదేశాన్ని నిర్మించాలన్న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆశయాలకు అనుగుణంగా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమానికి దేశంలో పనిచేస్తున్న 20 దేశాల రాయబార కార్యాలయాలకు చెందిన దాదాపు 100 మంది దౌత్యవేత్తలు,విదేశాంగ శాఖ ఇతర మంత్రిత్వ శాఖలకు చెందిన సీనియర్ అధికారులు హాజరయ్యారు.

పోలాండ్, కిరిబాటి, దక్షిణ కొరియా, మెక్సికో, థాయిలాండ్, లావోస్, స్విట్జర్లాండ్, బంగ్లాదేశ్, మాల్దీవులు, అమెరికా, బ్రెజిల్ తదితర 20 దేశాలకు చెందిన దౌత్యవేత్తలు ఉన్నారు. ఐక్యరాజ్యసమితి లాంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు కూడా కార్యక్రమానికి హాజరయ్యారు.

దేశం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజన కళాకారులు ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రముఖులు సందర్శించారు. వీటిలో ప్రదర్శించిన అరుదైన హస్త కళలను చూసి వీరు ఆశ్చర్యానికి గురయ్యారు. వీటి వివరాలను తెలుసుకోవడానికి ఆసక్తి కనబరిచారు. 200 స్టాళ్లలో ప్రత్యేకమైన హస్తకళల ప్రదర్శన ఏర్పాటు చేశారు. వీటిలో చేతితో చేసిన వస్త్రాల నుంచి ఆభరణాలు, బొమ్మలు, పెయింటింగ్‌లు ఉన్నాయి. గిరిజన కళలు, బొమ్మల తయారీ అంశాలపై ప్రముఖులకు అధికారులు సమగ్రంగా వివరించారు. సందర్శకుల ఎదుట కుండలు, గాజులు తయారు చేసే విధానాన్ని ప్రత్యక్షంగా తెలిపిన గిరిజనులు, వారి కళ్ళ ముందు బొమ్మలు గీసి ఆకట్టుకున్నారు. గిరిజనులు తమ సంస్కృతిలో భాగమైన తోలు బొమ్మలాట ప్రదర్శించారు.

ఈ సందర్భంగా ట్రైఫెడ్ ఆది మహోత్సవ్ లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. గిరిజన కళాకారులు, అడవుల్లో నివసిస్తున్న వారిని జన జీవన స్రవంతిలోకి తీసుకుని వచ్చి వారి సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు ట్రైఫెడ్ అధికారులు వివరించారు. ఆది మహోత్సవ్ ఒక చిన్న గిరిజన భారత దేశంగా ఏర్పాటయింది. దేశం వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజనులు తమ సంస్కృతి, కళలు ప్రదర్శిస్తున్నారు. గిరిజన వంటకాలు కూడా ఇక్కడ లభిస్తున్నాయి. ప్రతి ఏటా దేశం వివిధ ప్రాంతాల్లో దాదాపు 500 ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నామని ట్రైఫెడ్ అధికారులు వివరించారు.

గిరిజన కళాకారులు, గిరిజనుల జీవన శైలిని అధికారులు వివరించారు. గిరిజనులకు సాధికారత కల్పించి, ఆర్థికంగా వారు అభివృద్ధి సాధించడానికి అమలు చేస్తున్న చర్యలను ట్రైఫెడ్ అధికారులు వివరించారు. గిరిజన వంటకాలను సందర్శకులు రుచి చూసారు. వీటిలో జమ్మూ మరియు కాశ్మీర్ వంటకం మటన్ సీక్ కబాబ్, ఒడిశా ఫిష్ పకోరా, జమ్మూ మరియు కాశ్మీర్ చమన్ పనీర్, రాజస్థాన్ బెసంకిగట్టేకి సబ్జీ, తెలంగాణ మటన్ మరియు చికెన్ బంజారా బిర్యానీ, మధ్యప్రదేశ్ బఱ్రా మరియు మక్కెకి రోటీ, గుజరాత్ మూంగ్ కా హల్వా వంటి కొన్ని ప్రత్యేక గిరిజన వంటకాలను విదేశీయులు రుచి చూసారు.

గ్రామీణ వికాస్ చేతన్ సంస్థాన్, బార్మర్ రేపు సాయంత్రం గిరిజన హస్తకళలు, చేనేత మరియు ఉపకరణాలపై ప్రత్యేక ప్రదర్శన నిర్వహిస్తుంది. ఇది గిరిజనుల కళాత్మక సంప్రదాయం మరియు నైపుణ్యానికి వేదికగా నిలిచి వారి ప్రత్యేక ఉత్పత్తులనుపరిచయం చేస్తుంది.

ఒక మినీ భారతదేశాన్ని తలపిస్తున్న ఆది మహోత్సవ్ అన్ని వర్గాలకు చెందిన ప్రజలను ఆకర్షిస్తోంది. బహుమతులుగా ఇవ్వడానికి ఉపయోగపడే అనేక వస్తువులను దీనిలో ప్రదర్శిస్తున్నారు. సాధారణ వినియోగానికి రోగ నిరోధక శక్తిని పెంచే వివిధ ఉత్పత్తులను దీనిలో విక్రయిస్తున్నారు. వీటిలో గిరిజన ఉత్పత్తులైన ఎండు ఉసిరి , అడవి తేనె, నల్ల మిరియాలు, దాలియా, మిరపకాయ, రాగులు , త్రిఫల మరియు పప్పు మిశ్రమాలైన మూంగ్ పప్పు, ఉరద్ పప్పు , వైట్ బీన్స్ వంటివి ఉన్నాయి. వీటితో పాటు బొమ్మలు, హస్త కళలు ఆభరణాలు, పూసలతో చేసిన నెక్లెస్‌లు, ఎరి సిల్క్, చందేరీ సిల్క్, తోలు బొమ్మలు, చిన్న పిల్లల ఆటవస్తువులు, డోంగ్రియా శాలువాలు మరియు బోడో నేయడం వంటి సాంప్రదాయ అల్లికలు, తోడా ఎంబ్రాయిడరీ మరియు కోట-డోరియా దుపట్టాలు, ఇనుము రాతి కుండలు లాంటి 1500 వస్తువులను దీనిలో ప్రదర్శిస్తున్నారు.

రాజస్థాన్ నీలి కుండలు, కోట డోరియా ఫాబ్రిక్, మధ్యప్రదేశ్ చందేరి మరియు మహేశ్వరి సిల్క్, బాగ్ ప్రింట్, ఒడిషా పట్టచిత్ర, కర్ణాటక బిద్రివేర్, ఉత్తరప్రదేశ్ బనారసీ సిల్క్, పశ్చిమ బెంగాల్ దార్జిలింగ్ టీ, కాలా, హిమాచల్ ప్రదేశ్ జీరా, చాలా కారంగా ఉండే నాగా మిరపకాయ మరియు ఈశాన్యం నుంచి పెద్ద ఏలకులు వంటి ప్రసిద్ధ, సున్నితమైన వస్తువులను ప్రత్యేక జీఐ స్టోర్ లో సందర్శించవచ్చు.

స్థానికులకు సాధికారత కల్పించి, ఆత్మ నిర్భర్ సాధనకు ప్రయత్నాలు ముమ్మరం కావడంతో గత ఏడాది నుంచి భౌగోళిక అంశాలకు ప్రాధాన్యత లభిస్తోంది. గిరిజన వ్యవహారాల శాఖ, ట్రైఫెడ్ లు గిరిజన ఉత్పత్తులకు జియో టాగింగ్ చేస్తూ వాటికి ప్రత్యేక గుర్తింపు లభించి మార్కెట్ కల్పించి గిరిజనులకు సాధికారత కల్పించడానికి కృషి చేస్తున్నాయి. ఈ చర్యతో గిరిజన ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుంది. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ వల్ల అంతరించి పోతున్న గిరిజన కళలు, సంస్కృతి పూర్వ వైభవం కలుగుతుంది.

అవసరాలు మరియు బడ్జెట్‌పై ఆధారపడి ఈ ఉత్పత్తులను గిఫ్ట్ హాంపర్‌లుగా సిద్ధం చేయడానికి సౌకర్యాలు కల్పించారు. ట్రైబ్స్ ఇండియా కోసం ప్రత్యేకంగా ప్రఖ్యాత డిజైనర్ శ్రీమతి రినా ఢాకా రూపొందించిన ప్రీమియం ఆర్గానిక్, రీసైక్లింగ్, సస్టైనబుల్ ప్యాకింగ్ మెటీరియల్‌తో ప్యాక్ చేయబడే ఈ వస్తువులు ఏ సందర్భానికైనా బహుమతులుగా ఉంటాయి.

గిరిజన కళలు, సంస్కృతి, ఆలోచనలకు ప్రతి రూపంగా ఏర్పాటైన ఆది మహోత్సవ్ న్యూ ఢిల్లీలోని ఢిల్లీ హట్ లో ఉదయం 11 గంటల నుంచి సాయంకాలం ఐదు గంటల వరకు సందర్శించవచ్చు. గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేసి ఆత్మ నిర్భర్ భారత్ సాధనకు కృషి చేసి స్థానికులకు సాధికారత కల్పించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

'మన్ కీ బాత్' కార్యక్రమం 83 వ భాగం లో ప్రధాన మంత్రి ప్రసంగంపాఠం

న్యూఢిల్లీ, నవంబర్ 29:నా ప్రియమైన దేశప్రజలారా! నమస్కారం! ఈ రోజు మనం 'మన్ కీ బాత్' కోసం మరోసారి కలిశాం. రెండు రోజుల తర్వాత డిసెంబరు నెల కూడా మొదలవుతోంది. డిసెంబరు రాగానే సంవత్సరం గడిచిపోయినట్టే అనిపిస్తుంది. ఏడాదికి చివరి నెల కావడంతో కొత్త ఏడాదికి పునాదులు వేసుకుంటాం. దేశం అదే నెలలో నౌకా దళ దినోత్సవాన్ని,సాయుధ దళాల జెండా దినోత్సవాన్ని కూడా జరుపుకుంటుంది. డిసెంబర్ 16వ తేదీన దేశం 1971 యుద్ధ స్వర్ణోత్సవాన్ని కూడా జరుపుకుంటున్న సంగతి మనకు తెలిసిందే. ఈ సందర్భాలలోనేను దేశంలోని భద్రతా దళాలను గుర్తుకు తెచ్చుకుంటాను. మన వీరులను స్మరించుకుంటాను. అలాంటి వీరులకు జన్మనిచ్చిన ధైర్యవంతులైన తల్లులను గుర్తుకు తెచ్చుకుంటాను. ఎప్పటిలాగేఈసారి కూడా నమో యాప్ ద్వారానూ మీ గవ్ ద్వారానూ మీ అందరి నుండి నాకు చాలా సూచనలు వచ్చాయి.మీరు నన్ను మీ కుటుంబంలో ఒక భాగంగా భావించి మీ జీవితంలోని సంతోషాలను, బాధలను పంచుకున్నారు. ఇందులో చాలా మంది యువకులు ఉన్నారు. విద్యార్థులు ఉన్నారు. మన'మన్ కీ బాత్' కుటుంబం నిరంతరం అభివృద్ధి చెందుతుండడం నాకు సంతోషంగా ఉంటోంది. ఈ కార్యక్రమం మనస్సులతో అనుసంధానమవుతోంది. లక్ష్యాలతో అనుసంధానమవుతోంది. మన మధ్య లోతైన సంబంధంతో మనలో సానుకూల దృక్పథం నిరంతరం ప్రవహిస్తోంది.

నా ప్రియమైన దేశప్రజలారా! అమృత మహోత్సవానికి సంబంధించిన చర్చలు తనకు బాగా నచ్చాయని సీతాపూర్ నుండి ఓజస్వీ నాకు రాశారు. ఆయన తన స్నేహితులతో కలిసి 'మన్ కీ బాత్' వింటారు. స్వాతంత్ర్య పోరాటం గురించి చాలా తెలుసుకోవడానికి, నేర్చుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తారు. విద్యార్థులారా! అమృత మహోత్సవంనేర్చుకోవడంతో పాటు, దేశం కోసం ఏదైనా చేయాలనే స్ఫూర్తినిస్తుంది. ఇప్పుడు దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలు అయినా ప్రభుత్వాలు అయినా, పంచాయితీ నుండి పార్లమెంట్ వరకు అమృత మహోత్సవ ప్రతిధ్వని వినిపిస్తోంది. ఈ మహోత్సవానితో అనుసంధానమైన కార్యక్రమాల పరంపర కొనసాగుతోంది. ఈ మధ్య ఢిల్లీలో అలాంటి ఆసక్తికరమైన కార్యక్రమం ఒకటి జరిగింది. 'స్వాతంత్ర్య పోరాట కథలు-పిల్లల ప్రసంగాలు' అనే కార్యక్రమంలోపిల్లలు పూర్తి ఉత్సాహంతో స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన కథలను ప్రస్తావించారు. విశేషమేమిటంటే భారత్‌తో పాటు నేపాల్, మారిషస్, టాంజానియా, న్యూజిలాండ్, ఫిజీ దేశాలకు చెందిన విద్యార్థులు కూడా ఇందులో పాల్గొన్నారు. మన దేశానికి చెందిన మహారత్న సంస్థ ఓ.ఎన్.జి.సి. కూడా అమృత మహోత్సవాన్ని విభిన్నంగా జరుపుకుంటోంది. ఈ మహోత్సవ రోజుల్లోవిద్యార్థుల కోసం చమురు క్షేత్రాలలో అధ్యయన యాత్రలను ఓ.ఎన్.జి.సి. నిర్వహిస్తోంది. ఈ అధ్యయనాలలోఓ.ఎన్.జి.సి. ఆయిల్ ఫీల్డ్ కార్యకలాపాల గురించి యువతకు తెలియజేస్తున్నారు. మన వర్ధమాన ఇంజనీర్లు దేశ నిర్మాణ ప్రయత్నాలలో పూర్తి ఉత్సాహంతో,అభిరుచితో చేతులు కలపాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

మిత్రులారా! స్వాతంత్ర్య సాధనలో గిరిజన సమాజం అందించిన సహకారాన్ని దృష్టిలో ఉంచుకునిదేశం కూడా గిరిజనులు గర్వించదగిన వారోత్సవాలను జరుపుకుంది. దీనికి సంబంధించిన కార్యక్రమాలు దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరిగాయి. అండమాన్ నికోబార్ దీవులలోజారవా,ఒంగే వంటి గిరిజన వర్గాల ప్రజలు తమ సంస్కృతిని సజీవంగా ప్రదర్శించారు.హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనాకు చెందిన సూక్ష్మ లేఖకులు రామ్ కుమార్ జోషి అద్భుతమైన పని చేశారు. ఆయన చాలా చిన్నవైన పోస్టల్ స్టాంపులపైనే నేతాజీ సుభాష్ చంద్రబోస్, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిల ప్రత్యేకమైన చిత్రాలను రూపొందించారు. ఆయన హిందీలో రాసిన 'రామ్' అనే పదంపై చిత్రాలను రూపొందించారు. అందులో ఇద్దరు మహనీయుల జీవిత చరిత్రను కూడా క్లుప్తంగా చెక్కారు.మధ్యప్రదేశ్‌లోని కట్నీకి చెందిన కొంతమంది మిత్రులు కూడా ఒక చిరస్మరణీయమైన దాస్తాంగోయ్ కార్యక్రమం గురించి సమాచారాన్ని అందించారు. ఇందులో రాణి దుర్గావతి ఎనలేని ధైర్యసాహసాలు, త్యాగాల జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చారు. అలాంటి ఒక కార్యక్రమం కాశీలో జరిగింది. గోస్వామి తులసీదాస్, సంత్ కబీర్, సంత్ రవి దాస్, భారతేందు హరిశ్చంద్ర, మున్షీ ప్రేమ్‌చంద్, జయశంకర్ ప్రసాద్ వంటి మహానుభావుల గౌరవార్థం మూడు రోజుల పండుగను నిర్వహించారు.వివిధ కాలాలలోవీరంతా దేశ ప్రజల చైతన్యంలో పెద్ద పాత్ర పోషించారు. మీకు గుర్తు ఉండవచ్చు. 'మన్ కీ బాత్' ఇంతకుముందు భాగాలలో నేను మూడు పోటీలను ప్రస్తావించాను. దేశభక్తి గీతాలు రాయడం; దేశభక్తికి, స్వాతంత్ర్య ఉద్యమానికి సంబంధించిన సంఘటనలకు చెందిన రంగవల్లికలను రూపుదిద్దడం;పిల్లల మనస్సులలో భవ్య భారతదేశ స్వప్నావిష్కరణ చేసేందుకుచిట్టిపాట లను రాయడం. ఈ పోటీల కోసం మీరు తప్పనిసరిగా ఎంట్రీని పంపారని నేను భావిస్తున్నాను. మీరు మీ మిత్రులతో కూడా ప్రణాళిక వేసుకుని, చర్చించి ఉండాలి. మీరు ఖచ్చితంగా ఈ కార్యక్రమాన్ని భారతదేశంలోని ప్రతి మూలలో ఎంతో ఉత్సాహంతో ముందుకు తీసుకెళ్తారని నేను ఆశిస్తున్నాను.

వైద్య రంగంలో విప్లవం.. మరింత అప్ డేట్ అయిన ఆరోగ్యశ్రీ..

అమరావతి, నవంబర్ 29:గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ఉన్న ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేసే దిశగా ముమ్మరమైన ప్రయత్నాలు చేస్తోంది ప్రభుత్వం. అందులో భాగంగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితిని భారీగా పెంచి, పేదలందరికీ ఆరోగ్యరక్షగా నిలుస్తోంది. గతంలో రూ.రెండు లక్షల వార్షిక పరిమితి మాత్రమే ఉండగా.. దానిని రూ.ఐదు లక్షలకు పెంచి, పేదల వైద్యం పట్ల తమకున్న చిత్తశుద్ధిని పాలకులు చాటుకున్నారు. మరోవైపు గడిచిన రెండేళ్లలో ఆరోగ్యశ్రీలో అందించే చికిత్సలను కూడా భారీగా పెంచారు.రాష్ట్రం కరోనాతో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్పటికీ.. ప్రజారోగ్యం పట్ల నిబద్ధతతో ముందుకు సాగుతోంది. ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా కరోనాను ప్రభుత్వ పథకాల పరిధిలోకి తీసుకురాకున్నప్పటికీ.. మన రాష్ట్రంలో మాత్రం ఆరోగ్యశ్రీ పరిధిలో చేర్చి ఇప్పటిక

గుడ్ న్యూస్.. 587కే సిలిండర్.. ఎట్లంటే..

న్యూఢిల్లీ, నవంబర్ 29:ఈ మధ్య కాలంలో గ్యాస్ ధర రూ.900లకు చేరుకుంది. పెరుగుతున్న నిత్యవసర సరుకులతోపాటు గ్యాస్ సిలిండర్ రూ.900 కొనుగోలు చేయడం సామాన్యులకు భారంగా మారింది. అయితే.. కొంతకాలంగా ప్రభుత్వం ఇస్తున్న గ్యాస్ సబ్సిడీ కూడా రాకపోవడంతో ఇది మరింత భారంగా మారింది. కేంద్రం అందిస్తున్న సబ్సిడీ కొంతకాలంగా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. గ్యాస్ సబ్సిడీని పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. దీనికి సంబంధించి ఆర్థిక మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు కూడా అందాయి. ఇది ప్రస్తుతం పరిశీలనలో ఉందని సమాచారం. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఈశాన్య రాష్ట్రాల్లో డొమెస్టిక్ గ్యాస్ సబ్సిడీ ఇస్తున్నారు.

వీటితోపాటు కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీని దేశం మొత్తం అందించేందుకు ప్రణాళిక చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు గ్యాస్ డీలర్‌లకు రూ.303 సబ్సిడీ ఇస్తారు. దీంతో గృహ గ్యాస్ సిలిండర్ ధరపై రూ.303 తగ్గింపు ఇచ్చే అవకాశముంది. దీంతో గృహ సిలిండర్‌పై రూ.303 సబ్సిడీతో.. ఇప్పుడు గ్యాస్ సిలిండర్ రూ. 587కి అందుబాటులో ఉండనుంది. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.900 ఉంది. ఇలాంటి పరిస్థితిలో సబ్సిడీని పొందడానికి గ్యాస్ కనెక్షన్‌తో ఆధార్ నంబర్‌ను లింక్ చేయడానికి డీలర్‌షిప్‌ను సంప్రదించవచ్చు.

అయ్యప్ప స్వామి మహా పడిపూజలో ఎమ్మెల్యే వివేకానంద్

రంగారెడ్డి, నవంబర్ 29:కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, రంగారెడ్డి నగర్ 127వ డివిజన్ పరిధిలోని వెంకట్రామ్ రెడ్డి నగర్ శ్రీ సీతారామాంజనేయ విశ్వేశ్వర స్వామి దేవస్థానం వద్ద అయ్యప్ప స్వాములు ఏర్పాటు చేసిన మహా పడిపూజా మహోత్సవంలో ఈరోజు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, స్థానిక కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ? స్వామి వారి పడిపూజా మహోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ప్రజలపై అయ్యప్ప స్వామి వారి కృప తప్పక ఉంటుందని పేర్కొన్నారు. కరోనా పూర్తిగా అంతమై ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని అయ్యప్ప స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ సతీష్ గట్టోజీ, రామకృష్ణ, రఘునాథ్ రెడ్డి, రాజిరెడ్డి, మహదేవ్, శ్రీనివాస్, సత్తయ్య, స్థానిక నాయకులు భాస్కర్ రెడ్డి, కార్తిక్ గౌడ్, రహీమ్, తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు బుకీలు అరెస్టు..భారీగా నగదు స్వాధీనం

వరంగల్, నవంబర్ 29:: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముంబై కేంద్రంగా ఆన్‌లైన్ ద్వారా క్రికెట్, మూడు ముక్కల పేకాట బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు బుకీలను సోమవారం కేయూసీ పోలీసులు అరెస్టు చేసారు. వీరి నుంచి సుమారు 2కోట్ల 5లక్షల 14వేల రూపాయల నగదు, 7 సెల్ ఫోన్లు, వివిధ బ్యాంకులకు సంబంధించి 43 పాస్‌బుక్‌లు, ఏటీఎం కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ డా.తరుణ్ జోషి వివరాలను మీడియాకు వెల్లడించారు.

పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు మాడిశెట్టి ప్రసాద్ (40) కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్ హఫీజ్ పేటలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకోని రెడీమెడ్ బట్టల వ్యాపారం నిర్వహించుకోనేవాడు.

నిందితుడు సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఇందుకోసం హఫీజ్ పేటలో మరికొద్ది మంది స్నేహితులతో కలిసి 2016 నుంచి క్రికెట్ బెట్టింగ్ ప్రారంభించాడు.

ఈ క్రమంలోనే నిందితుడు ప్రసాద్‌కు ఆన్‌లైన్ ద్వారా మహారాష్ట్రకు చెందిన క్రికెట్, మూడు ముక్కల పేకాట బెట్టింగ్ నిర్వాహకుడు అభయ్‌తో పరిచయం అయింది. ఇద్దరు కలిసి బెట్టింగ్ దందాలకు పాల్పడే వారని సీపీ తెలిపారు. ఈ బెట్టింగ్‌లో మోసపోయిన వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదుతో నిందితులపై కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు కేసులు, హన్మకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసును పోలీసులు నమోదు చేసుకోని సెంట్రల్ జోన్ డిసిపి పుష్ప అధ్వర్యంలో కేయూసీ, సైబర్ క్రైం పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేసి నిందితులను గుర్తించామన్నారు.

నిందితుల్లో ఒకడైన అభయ్ బెట్టింగ్ ద్వారా వచ్చిన లాభాన్ని పంచుకోనేందుకుగా సోమవారం మరో నిందితుడు ప్రసాద్ ఇంటికి వచ్చినట్లుగా పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ రెడ్డి తన సిబ్బందితో వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు బెట్టింగ్ ద్వారా వచ్చిన డబ్బుతో పాటు బ్యాంక్ పాసుబుక్కులు, ఏటీఎం కార్డులు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని సీపీ అభినందించారు.

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ఆధ్వర్యంలో 29నుంచి డిసెంబరు 5వరకూ

న్యూఢిల్లీ, నవంబర్ 29:స్వావలంబనతో కూడిన ఆత్మనిర్భర భారతదేశ నిర్మాణంపై తన కలలను, దార్శనికతను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలుసార్లు ఇతరులతో పంచుకొన్నారు. దేశం ఒకవైపు,.. 75సంవత్సరాల స్వాతంత్ర్య ఉత్సవాలను జరుపుకుంటూ అమృత గడియల్లోకి అడుగిడుతున్న వేళలో,?ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో ప్రపంచస్థాయి సారథిగా ఎదగగలిగిన తన శక్తి సామర్థ్యాలను గురించి మన జాతి యావత్తూ అవగాహన చేసుకోవలసిన తరుణం ఆసన్నమైంది.?గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పిన,..? 'యేహీ సమయ్ హై, యేహీ సమయ్ హై, సహీ సమయ్ హై. అన్న మాటలను అందరూ గుర్తుకు తెచ్చుకోవలసిన అవసరం ఉంది.

స్వాతంత్ర్య అమృత్ మహోత్సవంలో భాగంగా, ? ఆజాదీ కా డిజిటల్ మహోత్సవ్ పేరిట వారం రోజులపాటు పలు కార్యక్రమాలను, కార్యకలాపాలను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోంది. భవిష్యత్తు కోసం చేపట్టే కార్యక్రమాల ప్రణాళికను కూడా ఈ సందర్భంగా ప్రదర్శించబోతోంది. మన ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలను డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం ఎలా పరివర్తన చెందిస్తున్నదో, మన సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఆర్థిక అస్తిత్వాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నదో, డిజిటల్ పరిజ్ఞాన రంగంలో స్వావలంబనా స్ఫూర్తిని ఎలా రగిలిస్తున్నదో పేర్కొంటూ, ఈ కార్యక్రమాలను నిర్వహిస్తారు. వారంరోజులపాటు జరిగే ఈ కార్యక్రమాల్లో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రైల్వే, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన వివిధ శాఖల సీనియర్ అధికారులు, పారిశ్రామికరంగ ప్రముఖులు పాల్గొంటారు.

స్థూలంగా చెప్పాలంటే, భారతదేశాన్ని డిజిటల్ పరిజ్ఞాన రంగంలో సాధికారిక సమాజంగా, అధునాతన ఆర్థిక వ్యవస్థగా రూపొందించి, సాంకేతిక పరిజ్ఞాన, కమ్యూనికేషన్ రంగాల్లో దేశానికి స్వావలంబను సాధించిపెట్టడమే లక్ష్యంగా కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పనిచేస్తోంది. ఆజాదీ కా డిజిటల్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా, భారతదేశపు డిజిటల్ పరిజ్ఞాన పరివర్తనాక్రమాన్ని వివరిస్తూ నవంబరు 29నుంచి పలు కార్యక్రమాలను నిర్వహిస్తారు. వారం రోజులపాటు జరిగే సదస్సుల సందర్భంగా డిజిటల్ ఇండియా, ఎలక్ట్రానిక్స్ వ్యవస్థ రూపకల్పన–తయారీ, ఉమ్మడి సేవా కేంద్రాలకు (సి.ఎస్.సి.లకు) సాధికారత, స్వదేశీ కంప్యూటర్ డిజైనింగ్ ప్రక్రియలో దేశాన్ని ఆత్మనిర్భర భారత్.గా తీర్చిదిద్దడం, మైగవ్ పోర్టల్, డిజిటల్ చెల్లింపుల ఉత్సవం వంటి అంశాలను ఈ సందర్భంగా ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఫ్లీనరీ సమావేశాలు, ప్యానెల్ చర్చా కార్యక్రమాలు, ఎగ్జిషన్లు నిర్వహిస్తారు.

వారం రోజుల ఉత్సవాల్లో రోజువారీ కార్యక్రమాలు ఈ కింది విధంగా ఉంటాయి.

మొదటి రోజు: నవంబరు 29వ తేదీ..

అకమ్ వీక్ పేరిట జరిగే వారం రోజుల కార్యక్రమాలను, కార్యకలాపాలను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి తొలిరోజున ప్రారంభిస్తారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్,, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి సమక్షంలో ప్రారంభోత్సవం జరుగుతుంది.

స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన వాణిజ్య విభాగంగా ఎ.ఎస్.హెచ్. తదితర కార్యక్రమాలను ఈ సందర్భంగా ప్రారంభిస్తారు. ఉమంగ్ సేవల బట్వాడా విధానంపై ప్రకటన కూడా ఉంటుంది. 'సుపరిపాలనా ప్రక్రియకు దోహదపడే పబ్లిక్ డిజిటల్ వేదికలు' అన్న అంశంపై సదస్సును నిర్వహిస్తారు. ఈ–గవర్నెన్స్ పేరిట జరిగే కార్యక్రమాలపై అధ్యయన పత్రాల సమర్పణ, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతినిధులతో చర్చాగోష్ఠి నిర్వహిస్తారు.

2వ రోజు: నవంబరు 30.

రెండవ రోజున, 'జనాభా పెరుగుదల సమస్యపై పరిష్కారాలకోసం కృత్రిమ మేధో పరిజ్ఞానాన్ని సానుకూలంగా వినియోగించడం ?బ్లాక్ చెయిన్, ఎ.ఆర్./వి.ఆర్., డ్రోన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, జాగ్రఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్', 'కోవిడ్ వైరస్ మహమ్మారి సంక్షోభం అనంతరకాలంలో స్టార్టప్ సానుకూల వాతావరణాన్ని బలోపేతం చేయడం', కొత్త కోణం, కొత్తగా ఆవిర్భవిస్తున్న ధోరణులు తదితర అంశాలపై సదస్సులు నిర్వహిస్తారు. యువతకోసం బాధ్యతాయుతమైన కృత్రిమ మేధోపరిజ్ఞానం– ప్రభుత్వ పాఠశాలలకోసం జాతీయ కార్యక్రమం అన్న అంశంపై గ్రాండ్ ఫైనల్ కార్యక్రమం ఉంటుంది. ఈ సందర్భంగా 20 ఉత్తమ ప్రాజెక్టులకు అవార్డులను ప్రదానం చేస్తారు. భూమి–బి.ఎస్.ఎఫ్. గ్రాండ్ చాలెంజ్ విజేతలకు కూడా అవార్డుల ప్రదానం జరుగుతుంది.

3వరోజు: డిసెంబరు 1.

3వ రోజున పలు ప్యానెల్స్.తో చర్చా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 'ఎలక్ట్రానిక్స్ సిస్టమ్, డిజైన్, తయారీలో దేశాన్ని ఆత్మనిర్భర భారత్.గా తీర్చిదిద్దడం –2025–26నాటికి 250 బిలియన్ల అమెరికన్ డాలర్ల స్థాయిని చేరుకునేలా ప్రణాళిక'పై చర్చా కార్యక్రమం. అలాగే,.. 'మొబైల్ ఫోన్లు, ఐ.టి. హార్డ్.వేర్ పరికరాల ఉత్పత్తిని పెంచి, దేశాన్ని ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దడం.', 'ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీలో దేశాన్ని ఆత్మనిర్భర భారత్.గా తీర్చిదిద్దడం', 'ఆవిర్భవిస్తున్న సాంకేతిక పరిజ్ఞాన అంశాలు, కొత్త యుగపు పరికరాల విషయంలో స్వావలంబన', 'భారతదేశంలో సెమీ కండక్టర్ రూపకల్పన, ఇకో సిస్టమ్ ప్రదర్శన' వంటి అంశాలపై ప్యానెల్ చర్చా కార్యక్రమాలు ఉంటాయి. "మేక్ ఇన్ ఇండియా" లక్ష్య సాధనకోసం సేవలందించిన ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీలకు తగిన గుర్తింపునిచ్చి, అవార్డులు ప్రదానం చేయడం.

4వ రోజు: డిసెంబరు 2.

"కామన్ సర్వీస్ సెంటర్ (సి.ఎస్.సి.)–డిజిటల్ ఇండియా కార్యక్రమం కింద పౌరులకు సాధికారత కల్పించడం" అన్న అంశంపై సదస్సు జరుగుతుంది. సి.ఎస్.సి.ల పాత్రపై చలన చిత్ర ప్రదర్శన, కీలకమైన అధికారుల ప్రసంగాలు, వివిధ కార్యక్రమాలపై జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డ్)తో కేంద్ర పాఠశాల విద్య, అక్షరాస్యతా శాఖ అవగాహనా ఒప్పందాలు, సి.ఎస్.సి. కిసాన్ క్రెడిట్ కార్డుకోసం హెచ్.డి.ఎఫ్.సి.తో ఒప్పందం ఉంటాయి. సి.ఎస్.సి. పే అనే వ్యవస్థ ప్రారంభంపై కార్యక్రమం. అగ్రశ్రేణిలో సేవలందించిన 10 సి.ఎస్.సి.లకు/పి.ఎం.జి. దిశా వి.ఎల్.ఇ.లకు సత్కార కార్యక్రమం నిర్వహిస్తారు.

5వ రోజు: డిసెంబరు 3.

'స్వదేశీ కంప్యూట్ డిజైన్లలో దేశాన్ని ఆత్మనిర్భర భారత్ గా తీర్చిదిద్దడం' అనే అంశం ఇతివృత్తంగా 3వ రోజు కార్యక్రమాలు ఉంటాయి. 'స్వదేశీపరిజ్ఞానంతో మైక్రో ప్రాసెసర్ల తయారీలో భారతదేశాన్ని ఆత్మనిర్భర భారత్.గా తీర్చిదిద్దడం' అనే అంశంపై వివిధ ప్యానెల్స్ మధ్య చర్చా కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్వదేశీ మైక్రోప్రాసెసర్ చాలెంజ్ కార్యక్రమం కింద ఫైనల్ దశకు చేరుకున్న 30 సంస్థల స్టాల్స్.ను ప్రదర్శిస్తారు. విజేతలుగా నిలిచిన పదిమంది ప్రతినిధులకు అవార్డుల ప్రదానం కార్యక్రమం ఉంటుంది.

6వ రోజు: డిసెంబు 4.

6వ రోజు, "మైగవ్ కార్యక్రమంతో ఆజాదీ కా డిజిటల్ మహోత్సవ్" పేరిట రోజు పొడవునా పౌరుల ప్రమేయంతో కూడిన మేళా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా, మొదడకు మేతగా పనిచేసే భావనలతో వినోదంతో కూడిన కార్యకలాపాలను, కార్యక్రమాలను నిర్వహిస్తారు. పలువురు ప్రముఖులు, పారిశ్రామిక రంగ భాగస్వామ్య ప్రతినిధుల ప్రసంగాలు, మై గవ్ సాథీస్.తో ప్రధాన చర్చా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ముఖ్యమైన ప్రభుత్వ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామిక ప్రముఖులు, మై గవ్ పోర్టల్ భాగస్వామ్య ప్రతినిధులు, సాథీస్ ప్రతినిధులు తదితరులతో ప్యానెల్ చర్చా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తారు.

7వ రోజు: డిసెంబరు 5.

చివరి రోజున "డిజిటల్ చెల్లింపు ఉత్సవ్" పేరిట చర్చా కార్యక్రమం నిర్వహిస్తారు. 'డిజీపే: విజన్ 2030' అన్న అంశంపై జరిగే ఈ చర్చలో భారతీయ రిజర్వ్ బ్యాంకు, డి.ఎఫ్.ఎస్., భారత జాతీయ చెల్లింపుల సంస్థ (ఎన్.పి.సి.ఐ.), భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్.బి.ఐ.), ఐ.సి.ఐ.సి.ఐ./హెచ్.డి.ఎఫ్.సి., పి.సి.ఐ., ఫోన్.పే, పేటీఎం సంస్థల ప్రముఖ అధికారులు పాలుపంచుకుంటారు. ఈ సందర్భంగా, స్టార్టప్ కంపెనీల ప్రెజెంటేషన్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, డిజిటల్ పేమెంట్స్ యాత్ర వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. డిజిటల్ చెల్లింపుల దిశగా సాగుతున్న పయనం గురించి ఈ సందర్భంగా వివరిస్తారు. చుట్కీ బజకే గీతం ఆవిష్కరణతోపాటుగా, పి.ఎం. స్వానిధి, భారత్ బిల్ పే సిస్టమ్ (బి.బి.పి.ఎస్.) వంటి ప్రోత్సాహక పథకాలపై కార్యక్రమం నిర్వహిస్తారు.

ఇక వివిధ అంశాల్లో ప్రతిభావంతమైన సేవలందించినందుకుగాను బ్యాంకర్లకు, ఫిన్ టెక్ కంపెనీలకు అవార్డుల ప్రదానంతో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వారం రోజుల కార్యక్రమం ముగుస్తుంది. ఈ సందర్భంగా కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ముగింపు ప్రసంగం కూడా ఉంటుంది. డిజిటల్ ఇండియా పథకాలను వివరించే ఎగ్జిబిషన్ స్టాళ్లను ఈ సందర్భంగా నిర్వహిస్తారు. యువతకోసం బాధ్యతాయుతమైన కృత్రిమ మేధోపరిజ్ఞానం కార్యక్రమం కింద పాఠశాల విద్యార్థుల ప్రాజెక్టులు, సి.ఎస్.సి. ప్రాజెక్టులు, పేమెంట్ సొల్యూషన్స్,.. రోబోలు, డ్రోన్లు, అటానమస్ బాట్స్, ఎ.ఆర్. /వి.ఆర్. సొల్యూషన్స్ వంటి స్టార్టప్ కంపెనీల సృజనాత్మక ప్రాజెక్టులు, ఇతర అంశాలను కూడా ప్రదర్శిస్తారు. సృజనాత్మక సాంస్కృతిక విశేషంగా, ప్రధానమంత్రి కలలుగన్న ఆత్మనిర్భర భారత్ దార్శనికతను సాకారం చేసే ప్రధాన కార్యక్రమంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ పేరిట ఈ వారం రోజుల వేడుకలు జరుగుతాయి. ఈ కార్యక్రమాల వివరాలను ఈ లింకు ద్వారా తెలుసుకోవచ్చు.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

శ్రీశైలం, నవంబర్ 29: : అష్టాదశ శక్తిపీఠం, ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలానికి భక్తులు పోటెత్తారు. కార్తీక సోమవారం సందర్భంగా తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువ జాము నుంచే భక్తులు కృష్ణా నదిలో స్నానాలు చేసి నదీమాతకు పసుపు కుంకుమలు సమర్పించి, నదిలో దీపాలను వదిలారు. అనంతరం ఆలయానికి చేరుకొని క్యూలైన్ల ద్వారా మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఉదయం 3 గంటల సమయంలో ద్వారాలు తెరిచి, స్వామి అమ్మవార్లకు నిత్యకైంకర్యాది పూజాక్రతువులు నిర్వహించారు. 5 గంటల తర్వాత భక్తులను దర్శనాలకు అనుమతించారు. భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో గర్భాలయ, స్పర్శ దర్శనాలను నిలిపివేసి, కేవలం అలంకారణ దర్శనాలు మాత్రమే కల్పించారు.

గంగాధర మండపం, ఉత్తర మాడవీధిలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, నోములు నోచుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం ఈవో లవన్న తెలిపారు. భక్తులు కొవిడ్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే క్యూలైన్లలో భక్తులకు పాలు, అల్పాహారం అందజేసినట్లు వివరించారు.

డాక్టర్ శ్రీజను అభినందించిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్, నవంబర్ 29: తెలంగాణ రాష్ట్రం నుంచి సివిల్స్‌కు ఎంపికైన డాక్టర్ శ్రీజను విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అభినందించారు. సివిల్ సర్వీసెస్‌కు ఎంపికై త్వరలో శిక్షణకు వెళ్లనున్న ఆమె సోమవారం బషీర్ బాగ్‌లోని కార్యాల యంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసారు.

ఈ సందర్భంగా డాక్టర్ శ్రీజను మంత్రి అభినందించి, భవిష్యత్తులో మరింత రాణించాలన్నారు. శిక్షణలో మంచి ప్రతిభ చూపి తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు, పుట్టిన గడ్డ పేరు నిలబెట్టాలన్నారు. దేశంలోనే 20వ ర్యాంక్ సాధించటం ఎంతో గొప్ప విషయమని, యువతరానికి శ్రీజ విజయం ప్రేరణ ఇస్తుందని మంత్రి సబితా రెడ్డి అభిప్రాయ పడ్డారు.

ఉస్మానియా దవాఖానలో డాక్టర్‌గా ప్రజలకు సేవలందిస్తూనే దేశంలో అత్యున్నత సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన శ్రీజ నగరంలో ని ఉప్పల్‌లోని చిలుకనగర్‌లో నివాసం ఉంటున్నారు.

కృష్ణా ట్రైబ్యునల్ అంశంపై డిసెంబర్ 13న సుప్రీం కోర్టు విచారణ

న్యూఢిల్లీ, నవంబర్ 29: కృష్ణా ట్రైబ్యునల్ అంశంపై దాఖలైన పిటిషన్లపై డిసెంబర్ 13న సుప్రీం కోర్టు విచారణ జరుపనున్నది. కృష్ణా జలాల వివాద ట్రైబ్యునల్ తుది నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వ అధికారిక గెజిట్‌లో ప్రచురించాలని డిమాండ్ చేస్తూ కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లపై సోమవారం విచారణ జరిపింది. ఈ కేసులో ప్రతి స్పందన కోసం కేంద్రం తరఫున సీనియర్ హాజరైన న్యాయవాది రెండు వారాల గడువు కోరారు.

ఈ మేరకు కోర్టు డిసెంబర్ 13న విచారణ కోసం జాబితా చేసింది. కృష్ణా ట్రైబ్యునల్ ఉత్తర్వులు, గెజిట్ నోటిఫికేషన్ విడుదలపై ఫిటిషన్లను జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ విచారణ చేపట్టన న్నది. ఈ సందర్భంగా వాదనల వివరాలు ఇవ్వాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రను త్రినభ్య ధర్మాసనం ఆదేశించింది.

ఓటరు నమోదుకు రేపే చివరి తేదీ : లోకేష్ కుమార్

హైదరాబాద్, నవంబర్ 29:ఈనెల 1వ తేదీన విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు, నూతన ఓటరు నమోదుకు, ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చునని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్ తెలిపారు. భారత ఎన్నికల సంఘం 2021 సంవత్సరం ముసాయిదా ఓటరు జాబితాను నవంబర్ 1న విడుదల చేసిన నేపథ్యంలో ఆ ఓటరు జాబితాలో పేరు, అడ్రస్, తొలగింపు లాంటి మార్పులు చేర్పులు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అలాగే జనవరి 1, 2022 నాటికి 18 సంవత్సరాలు వయస్సు పూర్తయిన వారు కూడా నవంబర్ 30వ తేదీలోగా నమోదుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నియోజకవర్గ ఈఆర్ఓకు (డిప్యూటీ కమిషనర్ కార్యాలయం) కానీ, లిలిలి.నిలబజూ.తిని ఓటరు హెల్ప్ లైన్ యాప్ ద్వారా కానీ నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చునని లోకేష్ కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రజలను కోరారు.

ట్రావెల్ ఆంక్షలు ఎత్తివేయాలని కోరిన సౌతాఫ్రికా అధ్యక్షుడు

జోహన్నస్‌బర్గ్, నవంబర్ 29:: ఒమిక్రాన్ కరోనా వేరియంట్ ప్రబలుతున్న నేపథ్యంలో.. దక్షిణాఫ్రికా నుంచి వస్తున్న విమానాలపై ప్రపంచ దేశాలు ఆంక్షలు విధిస్తున్న విషయం తెలిసిందే. అయితే తమ దేశ విమానాలపై ఆంక్షలు విధించడాన్ని సౌతాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా ఖండించారు. ఆ చర్యల పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆంక్షలు అన్యాయమన్నారు. అర్జెంట్‌గా ఆ ఆంక్షలను ఎత్తివేయాలని ఆయన పిలుపునిచ్చారు. దక్షిణాఫ్రికా నుంచి వస్తున్న ప్రయాణికులపై బ్రిటన్, ఈయూ, అమెరికా దేశాలు ఆంక్షలు విధించాయి. ఒమిక్రాన్ వేరియంట్ ఆందోళనకరంగా ఉందని డబ్ల్యూహెచ్‌వో ప్రకటించిన తర్వాత పలు దేశాలు దక్షిణాఫ్రికా విమానాలపై నిబంధనలు పెట్టాయి. ఒమిక్రాన్ వేరియంట్ తొలుత సౌతాఫ్రికాలో నమోదు అయిన విషయం తెలిసిందే.

పంటల సేకరణలో జాతీయ విధానం తేవాలి : కేకే

న్యూఢిల్లీ, నవంబర్ 29:పంటల సేకరణలో జాతీయ విధానం తీసుకురావాలని రాజ్యసభలో టీఆర్ఎస్ పార్లమెంటరీ పక్షనేత కే కేశవరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం టీఆర్ఎస్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ దుర్భరమైన పరిస్థితుల్లో ఉంది. రాష్ట్రంలో రెండు పంటలు పండుతాయి. రబీలో పండే వరి పంట వాతావరణ పరిస్థితుల వల్ల బాయిల్డ్ రైస్‌గా చేసి కేంద్రానికి ఇస్తున్నాం.

తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి నీరు, విద్యుత్, పెట్టుబడి సాయం ఇస్తూ ఏ పంటలు వేయాలో అధ్యయనం చేస్తూ పంట ఉత్పత్తి సామర్థ్యం పెంచాం. 62 లక్షల ఎకరాల్లో పంట సాగు ఉంది.

ధాన్యం తీసుకోవాలని చెప్తుంటే మీరు ఇంత ధాన్యం ఎలా పండిస్తారు? అని కేంద్రం అంటుంది. రైతు వ్యతిరేక కేంద్ర ప్రభుత్వం ఇది. పంటల సేకరణలో జాతీయ విధానం తేవాలి. ఎంత ధాన్యం సేకరిస్తారో కేంద్రం స్పష్టం చేయాలి.

ఎంఓయూ ప్రకారం.. 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని కేంద్రం అంటుంది.

తెలంగాణ నుంచి కోటి టన్నులు ధాన్యం ఇస్తాం తీసుకోండి.. ఇది దేశానికే ప్రయోజనం. మొత్తం కోటి టన్నుల ధాన్యాన్ని సేకరించాలి. 80, 85 లక్షల టన్నులు అంటూ కేంద్ర మంత్రి బేరం ఆడుతున్నాడు. కేంద్రం స్పష్టత ఇస్తే పంటల మార్పిడి అంశాన్ని రైతులకు వివరిస్తాం. రెండు మూడేళ్ల సమయం ఇస్తే పంట మార్పిడి వైపు రైతులు మళ్లుతారు. అంతవరకు బాయిల్డ్ రైస్ కొనుగోలు చేయాలని కేంద్రాన్ని కోరుతున్నాం. కేంద్రం కొనుగోలు చేయకపోవడం వల్ల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

తెలంగాణతో ఒకలా.. పంజాబ్‌తో ఒకలా వ్యవహరిస్తున్నది

రాష్ట్రం పట్ల కేంద్రం వివక్ష చూపకూడన్నారు. పంజాబ్ పట్ల ఒకలా.. తెలంగాణా పట్ల ఒకలా కేంద్రం వ్యవహరిస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఉత

మాజీ గవర్నర్‌ను కలిసిన బిజెపి దళిత మోర్చ రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 29 (నేటినిజం ప్రతినిధి):మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు ను హైద్రాబాద్ లోని తన నివాసంలో సోమవారం బిజెపి దళిత మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాష ప్రధాన కార్యదర్శి కార్యదర్శి కుమ్మరి శంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం వూల బొకే అందజేసి శాలువతో సన్మానించారు .ఈ కార్యక్రమంలో పలువురు దళిత మోర్చా రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు

ఆధ్యాత్మికం పర్యాటకంపై ప్రత్యేక దృష్టి...

-14 వందల కోట్లతో తెలంగాణ పర్యాటకం అభివృద్ధి..
-తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ చెర్మన్ శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 29 (నేటినిజం ప్రతినిధి):తెలంగాణ రాష్ట్రంలో ఆధ్యాత్మికం తో పాటు పర్యాటకంపై రాష్ట్ర

ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ అన్నారు. సోమవారం వేములవాడ పట్టణంలోని హరిత హోటల్ గ్రీన్ ఛాలెంజ్ లో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ రాజన్న ఆలయాన్ని చరిత్రలో నిలిచిపోయేలా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పునర్నిర్మాణం చేస్తున్నారన్నారు. పర్యాటక శాఖ నుంచి వేములవాడకు ప్రత్యేక ప్యాకేజీల ద్వారా భక్తులకు దర్శనం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కాలేశ్వరం ప్రాజెక్టు మధ్య మానేరు ప్రాజెక్టుల వద్ద ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేస్తూ న్నామన్నారు. త్వరలో 14 వందల కోట్ల నిధుల తో తెలంగాణ పర్యా టక ప్రదేశాల అభివృద్ధి జరగనుందన్నారు. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని హరి త హోటల్లో మెరుగైన సౌకర్యాలు, రాజన్న భక్తుల కోసం వసతి గదులను నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాడిశెట్టి కృపాల్,కటకం కిషన్, కటకం జనార్దన్,మదూరి శ్రీనివాస్,పైడి శ్రీనివాస్, ఎర్రబెల్లి శేఖర్, కొత్త అనిల్ కుమార్, టూరిజం శాఖ సిబ్బంది ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు పెన్నిధిగా సీఎం కేసీఆర్

- బాధితునికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన సర్పంచ్

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 29 (నేటినిజం ప్రతినిధి):కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకోలేని నిరుపేదలకు

అండగా నిలివాలని సదుద్దేశ్యంతో ముఖ్యమంత్రి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందిస్తూ సిఎం కెసిఆర్ పేదల పెన్నిధిగా నిలుస్తున్నారని రుద్రవరం సర్పంచ్ ఉరిడి రాంరెడ్డి అన్నారు.సోమవారం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు అయిన వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో గుండెల్లి రాజు లత' తునికి మల్లయ్య కు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ అయిన చెక్కును ను స్థానిక సర్పంచ్ ఉరిధి రాంరెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు ఈ సందర్భంగా సర్పంచ్ ఉ రిడీ రాంరెడ్డి మాట్లాడుతూ నిరు పేదల పెన్నిధిగా సిఎం కెసిఆర్ నిలుస్తున్నారని అన్నారు. బాధితుని కుటుంబ సభ్యులు మాట్లాడుతూనిరుపేదలకు ,సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేసిన సీఎం కె?సిఆర్ మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబుకు బాధితుని కుటుంబ సభ్యులు ,గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాడెం శ్రీనివాస్ ,ఎంపీపీ వైస్ చైర్మన్ ఉరిడి ప్రవీణ్ , తెరాస గ్రామాధ్యక్షుడు నడిగడ్డి హరికృష్ణ టీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉరిడిరాజిరెడ్డి (మెడికల్) ఎండీ. భాషు పార్వతి భూమేష్,,కట్ట ఎల్లయ్య, పూరి పార్వతి అంజయ్య ఉరిడి కిషన్, తునికి నరేష్ , ధనపల్లి రవి టీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

కీసరగుట్టలో భక్తుల సందడి

సంగారెడ్డి, నవంబర్ 29 : కీసరగుట్ట పరిసర ప్రాంతామంతా శివభక్తులతో కోలాహలంగా మారిపోయింది. కార్తికమాసోత్సవంలో భాగంగా చివరి సోమవారం కావడంతో నగర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో శివభక్తులు కీసరగుట్టకు తరలివచ్చారు. సోమవారం శివుడికి ఇష్టమైన రోజు కావడంతో తెల్లవారుజాము 3.30గంటల నుంచే కీసరగుట్టలో ఆలయం వారు అభిషేకాలను ప్రారంభించారు.భక్తులు తండోపతండాలుగా కీసరగుట్టకు చేరుకొని స్వామివారి సేవలో పాల్గొన్నారు. గర్భాలయంలో స్వామివారికి తేనే, ఆవుపాలు, పంచామృతం, పంచదారలతో వేదపండితులు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మీనర్సింహస్వామివారిని, కాశీవిశ్వేశ్వరాలయంను, శ్రీ నాగదేవత ఆలయాలను దర్శించుకున్నారు.

విద్యార్థులకు చలి దుస్తుల పంపిణీ...

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 29 (నేటినిజం ప్రతినిధి): చందుర్తి. రుద్రంగి మండల ఎస్సీ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన చలి దుస్తులను (స్వేటర్లను) సోమవారం సంక్షేమ వసతి గృహాదికారి రవీంద్ర స్వామి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వార్డెన్ రవీంద్ర స్వామి మాట్లాడుతూ చలికాలంలో విద్యార్థుల కోసం ప్రభుత్వం సెటర్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు చలికాలంలో సెంటర్లను వేసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తుందన్నారు,

మోదీ క్షమాపణలో నిజాయితీ లేదు : తమ్మినేని వీరభద్రం

ఖమ్మం, నవంబర్ 29:: వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని మోదీ సర్కారు అనేక ఎత్తులు వేసి విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. జిల్లా కేంద్రం ఎంబీ గార్డెన్‌లో జరుగుతున్న సీపీఐ (ఎం) ఖమ్మం జిల్లా 21వ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

నల్ల చట్టాలను రద్దు చేస్తామని మోదీ రైతులకు చెప్పిన క్షమాపణలో మతలబు దాగి ఉందన్నారు. ఏడు వందలమంది రైతులు చనిపోయినందుకు మోదీ క్షమాపణలు చెప్పలేదని తమ్మినేని గుర్తు చేశారు. రాబోవు అతికొద్ది రోజుల్లో వివిధ రాష్ట్రాలలో జరుగనున్న శాసనసభ ఎన్నికలలో గెలవాలనే మోదీ ఎత్తుగడలు వేస్తున్నారని ఆయన విమర్శించారు.

మళ్లీ నల్ల చట్టాలను ఎల్ఐసీ,ఎయిర్ ఇండియా, బొగ్గుగనులు, లాంటి పెద్ద పెద్ద సంస్థలను కార్పొరేట్ శక్తులకు అమ్మకానికి పెట్టా మోదీపై ధ్వజమెత్తారు. ప్రజాదనాన్ని కొల్లగొడుతూ.. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

వరద బాధితులకు ఎమ్మెల్యే సాయం.. ప్రతి ఇంటికి 25 కిలోల బియ్యం, నిత్యావసరాలు అందజేత

తిరుపతి, నవంబర్ 29: చిత్తూరు జిల్లా తిరుపతి రూరల్ మండలం వరద ఉధృతిలో నీట మునిగిన పాతకాల్వ గ్రామ ప్రజలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తక్షణ సాయం అందజేసి బాసటగా నిలిచారు. ఈ మేరకు తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పాతకాల్వ గ్రామంలోని ప్రతి ఇంటికి నిత్యావసర సరుకులను స్వయంగా అందజేశారు. వీటిలో 25 కిలోల బియ్యం, పామాయిల్, ఉర్లగడ్డ తదితర సరుకులను దాదాపు 500 కుటుంబాలకు అందించారు. గ్రామ ప్రజలు సైతం మోహిత్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు.

ప్రజల పట్ల బాధ్యతగా వ్యవహరించి నిత్యవసర సరుకులు అందించడం పట్ల ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి గారికి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజా సంక్షేమం కోసమే ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నిరంతరంగా పరితపిస్తున్నారని మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. వరద బాధితులకు ఇంటికి సైతం వెళ్లకుండా ప్రజల రక్షణ కోసం నిద్రాహారాలు మాని కష్టపడ్డారని తెలియజేశారు. ఇటీవల పోలీసులతో వాగ్వివాదం జరిగిన సంఘటనలో గాయపడిన మహిళకు మోహిత్ రెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆ మహిళా ధన్యవాదాలు తెలియజేశారు.

వేములవాడ రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 29 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ: రాష్ట్రంలో ప్రముఖ శైవక్షేత్రం వేములవాడ రాజన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్తికమాసం చివరి సోమవారం కావడంతో రాజరాజేశ్వరుని క్షేత్రానికి భక్తజనులు భారీగా తరలివచ్చారు.

స్వామివారి దర్శనానికి తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. క్యూలైన్లలో భక్తులు కిక్కిరిసిపోవడంతో స్వామివారి దర్శనానికి 6 గంటల సమయంపడుతున్నది. స్వామివారి ఆర్జిత సేవలు రద్దు చేసిన అధికారులు లఘు దర్శనం కల్పిస్తున్నారు. తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు.

న్యూ షాపూర్ నగర్‌లో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

రంగారెడ్డి, నవంబర్ 29:కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం 129 డివిజన్ పరిధిలోని న్యూ షాపూర్ నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాల్ ను ఈరోజు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ? కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి కాలనీ అభివృద్ధే తమ ధ్యేయమన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి కాలనీలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, ప్రధాన కార్యదర్శి సిద్ధిక్, యువ నాయకుడు మంత్రి అరుణ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ముకుంద్ రావు, నాయకులు మధు మోహన్, ఆమీర్ ఖాన్, బస్తీ కమిటీ ప్రెసిడెంట్ సత్యనారాయణ, బీసీ సెల్ జనరల్ సెక్రెటరీ ఆకుల రాజ్ కుమార్, బస్తీ వైస్ ప్రెసిడెంట్ రవికుమార్, ఉమర్, సంజీవ కుమార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లిలో ప్రొటోకాల్ రగడ.. కన్నీరు పెట్టుకున్న ఎంపీడీవో..

న్యూఢిల్లీ, నవంబర్ 29:తూర్పుగోదావరి జిల్లా అయినవిల్లి మండల ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం అవగాహన సదస్సు రసాభాసగా మారింది. ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో హౌసింగ్ డిఈ ఎమ్.జి.కె నాగరాజు అధ్యక్షతన మండల సర్పంచ్ లకు, ఎంపిటీసి లకు జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకంపై అవగాహన కల్పించేందుకు సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమ వేదిక మీదకు ఎమ్మెల్యేతో పాటుగా స్థానిక జడ్పీటిసి, ఎంపిపి, వైస్ ఎంపిపి, ఎంపిడిఒ, తహసీల్దారు, హౌసింగ్ ఇఇ లను పిలిచి సదస్సును ప్రారంభించాలని గృహ నిర్మాణ శాఖవారు నిర్ణయించుకున్నారు. కానీ కార్యక్రమం ప్రారంభ సమయంలో నేదునూరు ఎంపిటీసి ఇండుగుల వెంకట్రామయ్య లేచి మేము ప్రజా ప్రతినిధులం కాదా అంటూ ప్రశ్నించడంతో సర్పంచ్ లను, ఎంపిటిసిలను కూడా వేదిక మీదకు రావాల్సిందిగా హౌసింగ్ డిఈ ఆహ్వానించారు.

అనంతరం కొద్దిసేపటికి సమావేశానికి విచ్చేసిన జడ్పిటిసి గన్నవరపు శ్రీనివాస్ ను కూడా వేదిక మీదకు ఆహ్వానించారు. కానీ అక్కడ ఒక్క కుర్చీ లేకపోవడంతో ఆగ్రహంతో అధికారుల తీరుపై మండిపడ్డారు. ఇదేనా ప్రజా ప్రతినిధులకు మిరిచ్చే గౌరవం అంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. దీనికి సభాధ్యక్షులు ఎవరు అంటూ డిఈని ప్రశ్నించడంతో ఆయన పొరబాటున ఎంపిడిఒ అని తెలిపారు. దీనితో జడ్పిటిసి తో పాటుగా కొందరు అధికార వైసిపి నేతలు ఎంపిడిఒ పై ఏకవచనంతో సంభోధిస్తూ రెచ్చిపోయారు. నాకు సంబంధం లేదని ఆమె చెబుతున్న వివరణను సైతం వినకుండా మూకుమ్మడిగా వేదిక వద్ద ఎంపిడిఒ పై తీవ్ర స్వరంతో కేకలు వేస్తూ ఊగిపోయారు.

ఒకానొక దశలో ఉద్రిక్తత పరిస్థితులు కూడా ఏర్పడ్డాయి. చేసేదేమీ లేక ఆమె కన్నీటిపర్యంతమవుతూ వేదిక వద్ద నుంచి వెళ్ళిపోయింది. అనంతరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు వేదిక వద్దకు రావడంతో విషయం సద్దుమణిగి కార్యక్రమం సజావుగా సాగింది..

ఆర్టీసీ బస్ డిపోల్లో రేపు రక్తదాన శిబిరాలు

హైదరాబాద్, నవంబర్ 29: రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సు డిపోల్లో మంగళవారం రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నారు.

ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి రేపు రోజు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అవకాశం కల్పించింది. రాష్ట్రంలోని తలసీమియా బాధితుల కోసం ఆర్టీసీ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నది. రెడ్‌క్రాస్ సంస్థతో కలిసి రక్తదాన శిబిరాలను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు సైతం రక్తదానానికి ముందుకు రావాలని నంస్థ ఎండీ సజ్జనార్ పిలుపునిచ్చారు.

కరోనా కొత్త వేరియంట్‌ను ఎదుర్కొనేందుకు కేబినెట్ సబ్ కమిటీ

హైదరాబాద్, నవంబర్ 29: కరోనా కొత్త వేరియంట్ 'ఒమిక్రాన్'ను సమర్థవంతంగా ఎదుర్కోవడంతో పాటు, టీకా ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం కేసీఆర్ కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. మంత్రివర్గ ఉప సంఘానికి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చైర్మన్‌గా కొనసాగనున్నారు. పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సభ్యులుగా ఉండనున్నారు.

సీఎం కేసీఆర్ అధ్యక్షతన కేబినెట్ ప్రగతి భవన్‌లో సమావేశమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రజారోగ్యం, వైద్యసేవలకు సంబంధించి హెల్త్ డిపార్ట్‌మెంట్ సన్నద్ధత, అనుసరిస్తున్న కార్యాచరణ, రాష్ట్రవ్యాప్తంగా కోవిడ్ టీకాల పురోగతి, మందుల లభ్యత, ఆక్సీజన్ బెడ్స్ సామర్థ్యం, తదితర అంశాలపై కేబినెట్ సమీక్షించింది. కొత్త వేరియంట్‌ను ఎదుర్కొనేందుకు వైద్యశాఖ పూర్తి సన్నద్ధతతో ఉన్నదని, అన్ని రకాల మందులు, పరికరాలు, మానవ వనరులు, అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చుకొని ఎలాంటి పరిస్థితి ఉత్పన్నమైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కేబినెట్ అధికారులు కేబినెట్‌కు వివరించారు.

ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని దవాఖానాల్లోని పరిస్థితులను సమీక్షించి, అన్ని రకాల మందులు, టీకాలు, అవసరమైన వారందరికీ సత్వరమే అందేలా ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని, అవసరమైన వారందరికీ సత్వరమే టీకా ఇప్పించాలని సీఎం కేసీఆర్ ఆరోగ్యశాఖను ఆదేశించింది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, అందుకు మంత్రులందరూ వారి వారి జిల్లాల్లో సమీక్షించాలని, అవసరమైన వారందరికీ టీకా ఇప్పించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు.

బొగ్గుగనిలో చిక్కుకున్న నలుగురు.. 20 గంటలు మార్గాన్ని తవ్వి బయటపడ్డారు

రాంచీ, నవంబర్ 29:: బొగ్గు గనిలో చిక్కుకున్న నలుగురు మార్గం కోసం 20 గంటలు తవ్వి దాని నుంచి బయటపడ్డారు. జార్ఖండ్‌లోని బొకారో జిల్లాలో ఈ ఘటన జరిగింది. చందన్‌కియారి బ్లాక్‌లోని తిలతాండ్‌కు చెందిన ఆరుగురు వ్యక్తులు శుక్రవారం పర్బత్‌పూర్‌లోని భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ (బీసీసీఎల్) చెందిన పదిలేసిన గనిలో అక్రమంగా తవ్వకాలు జరిపారు. ఈ సందర్భంగా గనిలో ఒక భాగం కూలడంతో అందులో చిక్కుకున్నారు. అనంతరం ఇద్దరు వ్యక్తులు ఎలాగోలా బయటపడ్డారు. గని లోపల చిక్కుకున్న మిగతా నలుగురి జాడ తెలియలేదు.

సమాచారం అందుకున్న బీసీసీఎల్ అధికారులు లక్ష్మణ్ రాజ్వర్ (42), అనాది సింగ్ (45), రావణ రాజ్వర్ (46), భరత్ సింగ్ (45) కోసం రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. అయితే ఈ నలుగురిని గుర్తించడంలో విఫలమయ్యారు. దీంతో ఆదివారం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఔఆఖీఈ) సిబ్బందిని అక్కడకు రప్పించారు.

మరోవైపు శుక్రవారం నుంచి గనిలో చిక్కుకున్న నలుగురు వ్యక్తులు బయటపడే మార్గం కనుగొనేందుకు 20 గంటలకుపైగా తవ్వారు. చివరకు సోమవారం తెల్లవారుజామున 3.30 గంటలకు ఆ నలుగురు సురక్షితంగా గని నుంచి బయటకు వచ్చారని ఎస్పీ చందన్ కుమార్ ఝా తెలిపారు. అయితే గనిలో అక్రమ తవ్వకాలు జరిపి చిక్కుకున్న వారిపై చర్యలకు బీసీసీఎల్ యాజమాన్యం మౌనంగా ఉందన్నారు.

పేదింటి ఆడపడుచులకు అండగా తెలంగాణ ప్రభుత్వం : ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

జోగులాంబ గద్వాల, నవంబర్ 29:: పేదింటి ఆడపడుచులకు అండగా తెలంగాణ ప్రభుత్వం ఉంటుందని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి తెలిపారు.

సోమవారం గద్వాల మండల పరిధిలోని అనంతపురం, బస్రా చెరువు, బీరోలు లక్ష్మీపురం, పూడూరు వీరాపురం, ములకలపల్లి గ్రామాల్లో లబ్ధిదారులకు ఎమ్మెల్యే స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..తల్లిదండ్రులు ఆడపిల్లలకు పెళ్లి చేయాలంటే ప్రస్తుతం ఇబ్బందులకు గురవుతున్నారు.

అలాంటి సమయంలో వారికి చేయూతనిచ్చి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆడబిడ్డల పెళ్లిళ్లు చేయడానికి ప్రభుత్వం కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాలతో చేయూత ఇస్తుందన్నారు.

ఈ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తాసిల్దార్ లక్ష్మి , ఎంపీపీ ప్రతాప్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రామేశ్వరమ్మ, జడ్పీ వైస్ చైర్మన్ సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రాంప్టన్ కొత్త సోలారియం క్యూబ్ ప్లస్ వాటర్ హీటర్ మార్కెట్‌లోకి

హైదరాబాద్, నవంబర్ 29:ఆరోగ్యం మరియు పరిశుభ్రతపై అదనపు దృష్టి సారించడానికి చలికాలం వచ్చేసింది.మనం చల్లని షవర్ల నుండి వెచ్చగాహాయిని గొలిపే వేడి నీటికి మారినప్పుడు, సరైన వేడి నీటితో రోజంతా శక్తిని పొందడంలో లేదా రోజు చివరిలో విశ్రాంతి తీసుకోవడంలో మీకు సహాయపడటానికి మీ ఉష్ణోగ్రత వాంఛనీయ స్థాయిలో ఉండటం కంటే మెరుగైన అమృతం లేదు.మానవీయ ఆవిష్కరణలు, అత్యాధునిక ఉత్పత్తి లక్షణాలు 75 సంవత్సరాలకు పైగా అత్యుత్తమ పనితీరు వారసత్వంతో, భారతదేశం యొక్క అత్యంత ప్రాధాన్యత కలిగిన నాణ్యత, నమ్మకం మరియు ఆధునిక సాంకేతికత గల బ్రాండ్ క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, కొత్త సోలారియంక్యూబ్ ప్లస్ వాటర్ హీటర్ను ప్రారంభించింది

.వారి అత్యుత్తమ రేటింగ్ ప్రశంసించబడిన సోలారియం శ్రేణి నుండి, కొత్త వాటర్ హీటర్ అత్యుత్తమ హీటింగ్ పనితీరుతో వస్తుంది, ఇది ఖచ్చితమైన హీటింగ్, స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ సమకాలీన డిజిటల్ డిస్‌ప్లేను అందించడంతోపాటు పర్ఫెక్ట్ హాట్ వాటర్‌ను పొందడంలో మనకు సహాయపడుతుంది!

స్నానానికి ప్రతిరోజూ ఉదయం లేదా సాయంత్రం వేడి నీటి గందరగోళాన్ని ఎదుర్కొంటాము, అవి చాలా చల్లగా ఉండకూడదు అలాగని చాలా వెచ్చగా కూడా ఉండకూడదు.వాస్తవానికి, శీతాకాలపు రోజులలో వేడి నీటి స్నానం చేయడానికి 44లీ సెల్సియస్ సరైన ఉష్ణోగ్రతగా పరిగణించబడుతుందని పరిశోధనలో తేలింది.ఇటీవలి ఆవిష్కరణలు ఖచ్చితమైన హీటింగ్ టెక్నాలజీకి దారితీశాయి, ఇది వాటర్ హీటర్‌లలో ముఖ్యంగా చలికాలంలో ఉష్ణోగ్రత-నియంత్రిత స్నాన అనుభవాన్ని సులభతరం చేయడానికి ఒక ముఖ్యమైన అంశంగా ఉంటుంది, ఇక్కడ మనం ఎప్పటికప్పుడు నీటిని మాన్యువల్‌గా చేయితో తనిఖీ చేయడానికి బదులుగా డిజిటల్‌గా ఉష్ణోగ్రతను ముందే సెట్ చేయవచ్చు.మీ దైనందిన జీవితంలో మీకు సౌకర్యం మరియు సౌలభ్యాన్ని అందజేస్తూ, క్రాంప్టన్ యొక్క సరికొత్త సోలారియంక్యూబ్ ప్లస్మీ పరిపూర్ణ హాట్ వాటర్ ఇబ్బందులకు సరైన పరిష్కారం.దాని స్మార్ట్ ఎల్ ఇ డి టెంపరేచర్ డిస్‌ప్లే, ఖచ్చితమైన హాట్-వాటర్ టెక్నాలజీ దాని ఎనర్జీ సేవింగ్ కరెంటు బిల్లుల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, ఈ సరికొత్త ఆవిష్కరణ శీతాకాలంలోహాయిగొలిపే స్నానం కోసం అవసరమైనది.

వేడి నీటి కోసం, ఖచ్చితమైన వేడి-నీటిని పొందడానికి నిరంతరం చేయితో తనిఖీ చేసే పాత పద్ధతులకు ఇక వీడ్కోలు దసోలారియం క్యూబ్ ప్లస్ మీకు సౌలభ్యం, సౌకర్యం పరిపూర్ణతను ఒకేసారి అందజేస్తుంది కాబట్టి చల్లని శీతాకాలంలో స్నానాలు చేయడం ఆందోళన కలిగించదు. ఖచ్చితమైన వాటర్ హీటర్‌గా చేసే ఉత్పత్తి యొక్క కొన్ని అదనపు ఫీచర్లు క్రింద

ఇవ్వబడ్డాయి.

తాజా ఆవిష్కరణ గురించి మాట్లాడుతూ, క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, అప్లయన్స్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ సచిన్ ఫార్టియల్ఇలా వ్యాఖ్యానించారు,''క్రాంప్టన్‌లో, మా వినియోగదారులకు రోజువారీగా విలువను జోడించగల అర్థవంతమైన ఆవిష్కరణల కోసం మేము ఎల్లప్పుడూ కృషి చేస్తున్నాము.మనం చలికాలం సమీపిస్తున్న కొద్దీ, వాటర్ హీటర్ అనేది భారతీయ కుటుంబ సభ్యులందరూ వివిధ సమయాల్లో గతంలో కంటే ఇప్పుడు ఎక్కువగా ఉపయోగించే గృహోపకరణం.మేము మా ఆధునిక సాంకేతికతతో మరియు సాంప్రదాయ వాటర్-హీటర్ యొక్క డిజిటలైజేషన్‌తో మార్పును తీసుకురావాలనుకుంటున్నాము, తద్వారా అన్ని తరాలకు ఇది మరింత సౌకర్యవంతంగా మరియు అవాంతరాలు లేకుండా చేస్తుంది.

మా ఉత్పత్తుల ఉత్పాదనను కొనసాగించడమే మా లక్ష్యం మరియు సోలారియం క్యూబ్ ప్లస్అనేది వినియోగదారుల అంతర్దృష్టులను మెరుగుపరచడం,ఆవిష్కరించడం మరియు పని చేయడంలో ఒక అద్భుతమైన ఫలితం. ఆధునిక-యుగం వాటర్ హీటర్‌తో శీతాకాలాలు మరింత సౌకర్యవంతంగా మరియు ఆరోగ్యంగా ఉంటాయని మేము ఆశిస్తున్నాము, మా వినియోగదారులకు ఎటువంటి సందేహం లేకుండా ఖచ్చితమైన వేడి నీటిని పొందడంలో సహాయపడుతుంది!

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.